సంపుటి 10 సంచిక 3 మార్చి - ఏప్రిల్ 2022

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-10 Issue-3



# 'పల్లెసృజన పెన్నిధి' – ఇన్నోవేటర్ల ఆర్థిక అవసరాలకు వేదిక



2022వ సంవత్సరంలో మన పల్లెసృజన సంస్థ ఇన్నోవేటర్ల ఆర్థిక అవసరాలకై ఒక వేదికను తయారు చేయడానికి నిశ్చయించింది. ''పల్లెసృజన పెన్నిధి''గా ఇది ఆచరణలోకి వచ్చింది. ప్రతి ఇన్నోవేటర్‌కు, ఇన్నోవేషన్ను పూర్తి చేసే క్రమలో ఆర్థిక అవసరాలు ఉంటాయి. అవి వేల నుండి లక్షల రూపాయల వరకూ ఉండవచ్చు. అధిక ఇన్నోవేటర్లకు బ్యాంకులు, ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు ఋణాలు ఇవ్వరు. ఇచ్చినా ఎక్కువ వడ్డీతో ఇచ్చిన ఋణాలు ఇన్నోవేటర్లకు భారంగా ఉంటుంది.

"పల్లెసృజన పెన్నిధి" ఈ అవసరాలను తీర్చడానికి సరియైన వేదికగా రూపొందించడం జరిగింది.

'పల్లెసృజన పెన్నిధి' స్వచ్ఛందంగా ఇన్నోవేటర్లకు వడ్డీ లేకుండా లేదా, నామమాత్రపు వడ్డీతో ఆర్థిక సహాయం చేస్తుంది. సమాజంలో ఎవరైనా ముందుకు రావచ్చు. ఎంతైనా ఇవ్వవచ్చు. కనీసం 5 వేలు ఇవ్వాలి. ఇన్నోవేటర్ల అవసరాలు, వారి ఇన్నోవేషన్ వివరాలు పల్లెసృజన అభిప్రాయాలు, పెన్నిధి వేదికలో చేరుస్తారు. ఋణాలు ఇచ్చే వ్యక్తులు కాని, సంస్థలు కాని, సహాయం చేయడానికి నిర్ణయించుకుని, ఎవరికిస్తారో, ఎంత ఇస్తారో తెలపాలి. ప్రతి ఇన్నోవేటర్‌కై ఒక లీడ్ వాలంటీర్ నియమింప బడతాడు. ఈ వాలంటీరు డోనర్లకు అవసరమైన వివరాలు ఇన్నోవేషన్ గురించి ఆర్థిక అవసరాల వివరాలను తిరిగి ఇచ్చే ప్రణాళికలను తెలియజేస్తాడు. డోనర్లు వారి నిర్ణయం చేసిన తర్వాత లీడ్ వాలంటీరు సహకారంతో ఇన్నోవేటరు బ్యాంకులో జమ చేస్తారు. ఈ ఆర్థిక సహాయం తిరిగి డోనర్లకు చేరే వరకు లీడ్ వాలంటీరు పూర్తిగా సహకరిస్తాడు. 'పల్లెసృజన పెన్నిధి' డబ్బును తీసుకోదు, ఇవ్వదు. పూర్తి వివరాలకు http://pallesrujana.org వెబ్‌సైట్‌ను చూడండి.

గత మూడు నెలల్లో ముగ్గురు పల్లెసృజన ఇన్నోవేటర్లకు దాదాపు 25 లక్షలు పల్లెసృజన పెన్నిధి ద్వారా అందజేశాము. మరో 25 లక్షలకై ఇన్నోవేటర్ల వివరాలు వెబ్‌సైట్లో పెట్టడం జరిగింది. ఇప్పటికే అమెరికాలోని మన తెలుగు వాళ్ళు ఆంధ్ర, తెలంగాణ లోని వాలంటీర్లు వాళ్ళ మిత్రులు, బంధువులు ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. ఇప్పటికి వచ్చిన సహాయం నూటికి నూరుపాళ్ళు వడ్డీ లేని ఋణాలే.

మీరంతా ఈ కార్యక్రమంలో చేరి ఇన్నోవేటర్లకు పెన్నిధిగా మారవచ్చు. వ్యవస్థ నిర్లక్ష్యం చేసిన మన జ్ఞాన గ్రామ శాస్త్రవేత్తలకు మనమే సహాయం చేసుకోవడం మంచి పని కదా !

Vol-10, Issue - 3 March-April 2022



సంపుటి-10 సంచిక - 3 మార్చి - ఏప్రిల్ 2022

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

| | | |
|---|---|---|
| * పట్నం వదిలి, పల్లెబాట పట్టిన మౌలాలి... రైతు శ్రమ, ఖర్చు తగ్గించే స్ప్రేయర్ తయారీ | - | 4 |
| * ఇన్నోవేషన్లే జీవితంగా మార్చుకున్న అసామాన్యుడు తోట కృష్ణ భగవాన్ | - | 6 |
| * వేలాది మంది విద్యార్థులను ప్రకృతి ప్రేమికులుగా మారుస్తున్న, ప్రకృతికి దొరికిన వరం 'కొమెర జాజి' | - | 10 |
| * గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయంతో ప్రభుత్వ ప్రోత్సాహం | - | 12 |
| * పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి | - | 14 |
| * జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు | - | 18 |
| * ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం | - | 22 |
| * వృక్షాయుర్వేదము | - | 24 |
| * 10 వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు | - | 27 |
| * ఆయుర్వేద జ్ఞాన మథనం | - | 30 |
| * స్పందన | - | 31 |

**కవర్ లోపలి పేజీల్లో ...**

'పల్లెసృజన పెన్నిధి' ఇన్నోవేటర్ల ఆర్థిక అవసరాలకు వేదిక
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

మార్చి - ఏప్రిల్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank,
Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# కనిపించే జలం - కనిపించని జలం

'జలం' జీవరాసుల మనుగడకు అత్యవసరం. అందుకే సృష్టిలో దాన్ని భాగంగా చేసి, ప్రతి సంవత్సరం వర్షం ద్వారా మానవ మనుగడకై తగినంత నీటిని ప్రసాదిస్తుంది ప్రకృతి. భూతలంపై రెండింట మూడు వంతులు సముద్రాలున్న విషయం అందరికీ తెలిసిందే. పర్వతాలపై ఉత్తర, దక్షిణ ధృవాలపై శతాబ్దాలుగా పేరుకున్న మంచు కూడా నీళ్ళే, నదుల్లో, కాలవల్లో, బావుల్లో, గోతుల్లో, లోయల్లో ఉన్న నీరు మానవులకు, పశు పక్ష్యాదులకు ఉపయోగమే కదా. అయితే ఈ నీరు "కనిపించే జలం". ఏ రూపంలో ఎక్కడ ఎంత ఉంటుందో సరిగ్గా అంచనా వేయలేకపోయినా, నీరు పెరగదని, తరగదని మనకందరికీ తెలుసు. వృత్తాకారంలో సృష్టి నీటిని మానవాళికి అనంతంగా ఇస్తూనే ఉంటుంది.

మరొక జలం మనుషులకు అందులో ఉన్నది - "కనిపించని జలం". భూమిలో దాగి ఉంటుంది. వర్షాలు పడ్డప్పుడు భూమిలో ఇంకిన నీరు భూమిలోని ఖాళీల్లో చేరుకుంటుంది. భూమి ఎంత పొరలు పొరలుగా ఉంటే, అన్ని వర్షపు నీళ్ళు భూమిలో ఇంకే అవకాశముంది. వర్షం పడ్డప్పుడు ఎంత శాతం నీళ్ళు భూమిలోకి వెళ్ళి "కనిపించని జలం" అవుతుందో ఖచ్చితంగా చెప్పలేం. భూమి ఉపరితల పరిస్థితి వలన లోనికి వెళ్ళే నీళ్ళ ప్రమాణం కొంత అంచనా వేయవచ్చు. వర్షం ఒకమాదిరిగా పడితే భూమిలోకి వెళ్ళే నీళ్ళు ఇంకిపోతాయి. దాదాపు 30 శాతం నీళ్ళు భూమిలో ఇంకిపోతాయని ఒక అంచనా. అంటే వర్షం ద్వారా వచ్చిన నీటిలో 30 శాతం 'కనిపించని జలం'గా భూమిలోకి చేరుకుంటున్నాయి. కాని వర్షం ధారాళంగా పడితే, భూమి ఇంకుడు శక్తి అలాగే ఉంటుంది కాబట్టి ఎక్కువ నీరు పారి నదుల్లోకి, సముద్రాల్లోకి చేరుకుంటుంది. మనకు వర్షం ముఖ్యంగా ఒక సంవత్సరానికి 121 రోజులు పడతాయని ఒక అంచనా. అలా పడ్డప్పుడు కనీసం సంవత్సరానికి 600 సెం.మీ. వర్షపాతం మనందరం చూస్తాం. అయితే శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం వర్షాలు పడే రోజులు సంవత్సరానికి 43 రోజులకు తగ్గాయి. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. దీని ఫలితం వర్షపు నీరు అధికంగా పారి నదుల్లోకి వెళ్తుంది. మొత్తం వర్షపునీరు భూమిలోకి తక్కువగా ఇంకుతాయి. భూమిలో ఉన్న 'కనిపించని జలం' తగ్గుతూ వస్తుంది. రైతుకు అంతా అయోమయంగా ఉంటుంది. అయినా బోరుబావిలోని నీళ్ళపై ఆధారపడతారు. వర్షాధార ప్రాంతాల్లో రైతుకు మరో గత్యంతరం లేదు కదా! భారతదేశంలో 2011 గణాంకాల ప్రకారం 270 లక్షల బోరు బావులున్నాయని తేలింది. కనిపించే జలం మానవాళికి, పశు పక్ష్యాదులకు సరియైనది. ఈ జలాన్ని జలాశయాల్లో, బావుల్లో, వాగుల్లో, నదుల్లో, సముద్రాల్లో, వర్షాకాలంలో పడే వర్షాన్ని జాగ్రత్తగా నియంత్రిస్తే సమాజంలో ఆనందం ఎక్కువవుతుంది. ఈ నీరు అందరికీ అందుబాటులో ఉంటుంది. కాబట్టి వాడుకోవటానికి ఎక్కువ శక్తి అవసరం లేదు. మోటార్లు, ఇతర పంపులు వాటికి అవసరమైన పెట్రోలు, డీజలు, కరెంటు ఖర్చులు లేకుండా కనిపించే జలాన్ని రైతులు వాడుకోవచ్చు. పశు పక్ష్యాదులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఎక్కడ జలాశయాలు లేవో అక్కడ చెక్ డ్యామ్‌లు వాగులపై చిన్న నదులపై కట్టాలి. దీంతో కనిపించే జలాలతో కూడిన జలాశయం తయారవుతుంది. ఈ జలాశయాల్లో చేపలు పెంచవచ్చు. పరిసరాల్లో చిన్న పంటలుగా కూరగాయలు, పువ్వులు పండించవచ్చు. ఎక్కడ జలాశయాలు ఉంటే అక్కడ చుట్టుపట్ల పచ్చగా ఉంటుంది. పశు పక్ష్యాదులు ఎంతో ఆనందంతో నివసిస్తాయి. కనిపించే జలమే నిజమైన బలం. ఎవరిపై ఆధార పడకుండా ఊరి ప్రజలు ఆ నీటిని సునాయాసంగా వాడుకుని జీవితాన్ని మెరుగుగా చేసుకుంటారు.

అయితే వర్షం నీరు పారుదలను సరియైన దిశానిర్దేశాలతో మళ్ళిస్తే, జలాశయాలు నిండి అందరి జీవితాల్లో ఆనందం నింపుతాయి. నీరు పల్లమెరుగు అన్న యదార్థాన్ని సద్వినియోగం చేస్తూ



వర్షపు నీరు ఈ పల్లాల ద్వారా చెరువులు, కుంటలు, వాగులు, నదుల్లోకి సరిగ్గా మళ్ళిస్తే ప్రతి సంవత్సరం మనకు లభించే 600 సెం.మీ. వర్షపాతం కనిపించే జలాన్ని అధికంగా లభ్యం చేసే అవకాశముంటుంది. ఈ నీటి లభ్యంతో రైతన్నలకు కనిపించని జలాలపై ఆధారపడటం క్రమక్రమంగా తగ్గుతుంది.

గత 30 సంవత్సరాలుగా కనిపించే నీరు తగ్గిపోవడం, గ్రామాలు కనిపించని భూగర్భ జలంపై ఆధార పడటం పెరిగిపోయింది. ఈ పద్ధతిని తిరోగమనం చేయించాల్సిన అవసరం ఎంతో ఉంది. బోరు బావుల వాడకాన్ని సాధ్యమైనంత వరకు అంచలంచలుగా తగ్గించాలి. బోర్లు వేయటంలో టెక్నాలజీ ఉపయోగించి, ఎక్కడ నీళ్ళు పడతాయో అక్కడ వేయడం వల్ల రైతులకు కష్టాలు, నష్టాలు తగ్గిపోతాయి. ఐఎస్ఆర్ఓ, భూజల శాఖలు, టెక్నాలజీ సంస్థలు కలసి రైతు క్షేమం కోసం పని చేయాలి. బోరు బావుల్లో ఎంత నీరుందన్న విషయం రైతుకు సరైన సమయానికి సాంకేతికత ద్వారా తెలియజేయాలి. కర్ణాటకకు చెందిన గిరీష్ గ్రాస్‌రోట్స్ ఇన్నోవేటర్ ఒక చక్కని ఇన్నోవేషన్‌తో రైతులకు బోరు బావిలోని నీళ్ళ గురించి చక్కగా చెప్పగలుగుతున్నాడు. ఇలాంటి సాంకేతికతను రైతుల వద్దకు తక్కువ ధరలో అందుబాటులో ఉండేలా ప్రయత్నాలు చెయ్యాలి. నీళ్ళ సౌలభ్యం బట్టి రైతు సాగు విస్తీర్ణం, సాగు రకం నిర్ణయించాలి. ఇలా రైతుకు నీటిని గురించి ఒక మంచి స్పష్టతను ఇచ్చే ప్రయత్నం చెయ్యాలి. బోరు బావుల్లో ఎక్కువ నీటి లభ్యానికి గురుమూర్తి శెట్టి తయారు చేసిన బోరు కేసింగులో రంధ్రాలు చేసే సులభమైన యంత్రాన్ని రైతులకు అందజేయాలి. ఈవిధంగా కనిపించని జలాల గురించి సాధ్యమైనంత సాంకేతిక పరిజ్ఞానంతో రైతుకు తెలియజేస్తే వ్యవసాయంలో అనిశ్చిత చాలావరకు తగ్గుతుంది.

ప్రభుత్వం దూరదృష్టితో ఈ రెండు జలాల వాడకాన్ని నిర్దేశిస్తూ రైతులకు తోడినన్ని నీళ్ళందిస్తూ, సుదూర భవిష్యత్తులో ప్రజలు తిరిగి కనిపించే జలాలనే వాడేట్టు ప్రణాళికలు తయారు చేయాలి. కనింపించని జలాలపై మానవాళి ఆధార పడటం తగ్గిపోవాలి.

నీరు మనకు ప్రకృతి ఇచ్చిన వరం. దీన్ని ప్రసాదంగా భావించి రైతులు, ప్రభుత్వం, శాస్త్రజ్ఞులు, రాజకీయ నాయకులు గౌరవ భావంతో నిగ్రహంతో, నియమంగా, ఆత్యాశ లేకుండా వాడే పద్ధతులను నిర్ధారిస్తారని, ప్రజలు చుట్టూ కనిపిస్తున్న జలాలతో భవిష్యత్తులో ఆనందంగా ఉంటారని, పశు పక్ష్యాదులతో చక్కని సహజీవనం చేస్తారని మనమంతా ఆశిద్దాం.... సాధిద్దాం.

ఎండాకాలం ఈసారి తీవ్రంగా ఉంది. మనల్ని మన తోటి వాళ్ళను, పశువులను, పక్షులను కనిపించే జలంతో కాపాడుకుంటారని మనసారా ఆశిస్తూ......

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. – ఎడిటర్

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700




# పట్నం వదిలి, పల్లెబాట పట్టిన మౌలాలి .....
# రైతు శ్రమ, ఖర్చు తగ్గించే స్ప్రేయర్ తయారీ

- వీరరాఘవ రెడ్డి

పల్లెలు వదిలి పట్టణాలకు వలసలు పెరుగుతున్న రోజులు మారాయి. పట్టణాలు వదలి పల్లెబాట పడితే ఊర్లోనే అపరిమిత ఆనందంతో కూడిన ఆదాయం పొందవచ్చు అని నిరూపించాడు ఈ ఇన్నోవేటర్ మౌలాలి. ఇతనిది కృష్ణా జిల్లా (ఎన్‌టిఆర్ జిల్లా), చందర్లపాడు మండలం, చింతలపాడు గ్రామం. మౌలాలి ఇంటర్మీడియట్ వరకు నందిగామలో చదివి, ఆ తర్వాత హైదరాబాద్‌కు జీవనోపాధికై వెళ్ళాడు. 1992 నుండి 2008 వరకు యంఆర్ఎఫ్ టైర్ తయారీ కంపెనీలో ఉద్యోగం చేశాడు. అలా జీవనయానం సాగుతున్న పరిస్థితుల్లో ఇతనికి 'పక్షవాతం' వ్యాధి వచ్చి, తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చింది. తన ఉద్యోగంలో యంత్రాలపైన పని చేసిన అనుభవంతో తానే స్వయంగా ఏదైనా యంత్రాలకు చెందిన షాపు ఏర్పాటు చేసుకుంటే జీవనం సాఫీగా జరుగుతుందని అనుకున్నాడు. పెరిగిన వాతావరణం అంతా పల్లెటూరు కావటంతో పంటలు, రైతులపై బాగా అవగాహన ఉండేది. అప్పుడు ప్రభుత్వం వారు రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు, అనేక రకాల వ్యవసాయ యంత్రాలు ఇస్తుండటం చూశాడు. కాబట్టి ఇందులో అనుభవం సంపాదించుకుంటే బావుంటుంది అనుకున్నాడు. కొందరు మిత్రుల సలహా మేరకు ఆగ్రోస్ సంస్థలో శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకున్నాడు. అలా ఆగ్రోస్ వారు అనంతపురం జిల్లా గార్లదిన్నెలో 3 నెలల పాటు ఇతనికి వ్యవసాయ పరికరాల రిపేర్లు, వాటి పని తీరు పై శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత దక్షిణ భారత వ్యవసా య క్షేత్రంలో 6 మాసాలు శిక్షణ తీసుకున్నా డు. ఆ తర్వాత నల్గొండ జిల్లా పోచంపల్లి లోని రామా నంద ఇన్‌స్టిట్యూట్‌లో 3 మాసాలు శిక్షణ తీసుకున్నా డు. ఇలా వ్యవసాయ పనిముట్ల పనితీరు, వాటి నిర్వహణ, మరమ్మతుల గురించి పూర్తిగా శిక్షణతో పాటు ఒక సర్టిఫికెట్ కూడా సంపాదించాడు. ఈ సర్టిఫికెట్ సహాయంతో రాష్ట్రం (సమైక్య) లోని ఏదైనా మండ లంలో ఒక సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకునే సదుపాయం కల్పించారు. ఇందుకు అవసరమైన షాపు రెంటు, కరెంటు బిల్లుతో పాటు నెలకు 12 వేల రూపాయల జీతం కూడా ఆగ్రోస్ వారు సమకూర్చారు. ఇంతలో ప్రభుత్వం మారటంతో ఈ స్కీమును తీసివేయటం జరిగింది.

> జీవనయానం సాగుతున్న పరిస్థితుల్లో ఇతనికి 'పక్షవాతం' వ్యాధి వచ్చి, తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చింది. తన ఉద్యోగంలో యంత్రాలపైన పని చేసిన అనుభవంతో తానే స్వయంగా ఏదైనా యంత్రాలకు చెందిన షాపు ఏర్పాటు చేసుకుంటే జీవనం సాఫీగా జరుగుతుందని అనుకున్నాడు.

అప్పటికే ఎంతోమంది రైతులతో పరిచయం ఏర్పడటంతో ఇదే పనిని వ్యాపారంగా చేసుకుని, జీవనం సాగిద్దామని తానే స్వయంగా ఒక షాపు ఏర్పాటు చేసుకున్నాడు. గుంటూరు నుంచి కొత్త స్ప్రేయర్లను టోకున కొనుగోలు చేసుకుని రైతులకు అమ్ముకోవటం, స్ప్రేయర్ల రిపేరీలు చేయటం కొనసాగించాడు.

అలా తన వ్యాపారం సజావుగానే సాగుతున్న సమయంలో రైతులు ఎక్కువగా చెప్పే సమస్య అయిన స్ప్రేయర్ నాజిళ్ళలో చిన్న చిన్న దుమ్ము కణాలు ఇరుక్కుని పిచికారి చేయటంలో ఏర్పడుతున్న సమస్యకు పరిష్కారం కనుగొనాలి అనుకున్నాడు. మార్కెట్‌లో స్ప్రేయర్ నుండి విడుదల అయ్యే మందు ద్రావణం ఒకే పైపు ద్వారా వస్తుంది. అలా రావటం వల్ల స్ప్రే చెయ్యడం ఆలస్యమవుతోంది. పైగా 20–25 లీటర్ల మందు నీటి డ్రమ్మును మోయడం వల్ల చాలా అలసటకు గురవుతున్నారు. రైతులకు ఈ కష్టాన్ని ఎలా తొలగించాలి అని ఆలోచించాడు. దీనికి పరిష్కారం స్ప్రేయర్ నుండి మందు ద్రావణం ఒకే పైపు ద్వారా కాకుండా, రెండు పైపుల ద్వారా వెళ్ళ గలిగితే పిచికారి త్వరగా అవుతుంది అని మార్కెట్ అంతా పది పదిహేను రోజుల పాటు శోధించి అలాంటి స్ప్రేయర్‌లు ఏమైనా లభిస్తాయేమో నని చూశాడు. అలాంటివి లేవని గ్రహించి, తానే 'డబుల్ ఇన్‌పుట్' వచ్చేలా తయారు చేయటానికి పూనుకున్నాడు.

తానే స్వయంగా తన ఆలోచన ప్రకారం ఒక లేత్ మిషన్ వద్ద కూర్చుని స్ప్రేయర్‌కు డబుల్ ఇన్‌పుట్ వచ్చేలా ఒక విడి భాగాన్ని తయారు చేయించాడు. ఈ విడి భాగం మొత్తం ఇత్తడి (బ్రాస్) లోహంతో తయారు చేయించాడు. ఎందుకంటే ఈ విడి భాగం ఇనుముతో చేస్తే అది తుప్పు పట్టే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఈ విడి భాగం ఇత్తడితోనే చేయాలి

అని రెండు ఇన్‌పుట్‌లు వచ్చేలా చేసి, ఆ పోర్ట్ ద్వారా వచ్చే నీరు ఒకే ఔట్‌పుట్ (ద్రావణం బయటకు వెళ్ళే మార్గం) ద్వారా వెళ్ళేలా చేశాడు. మొత్తానికి తాను అనుకున్న విధంగా స్ప్రేయర్‌కు రూపకల్పన చేసి తన గ్రామంలోని 'సాంబశివరావు' అనే రైతుకు అందించాడు. అతను పది ఎకరాల్లో పశువుల గడ్డి, 50 ఎకరాల్లో ప్రత్తి పండిస్తూ ఉంటాడు. అతనివద్ద ఎప్పుడూ 3-4 స్ప్రేయర్లు ఉంటాయి. వాటి రిపేర్లు, మందు పిచికారి చేసే కూలీల ఖర్చు చాలా ఎక్కువ అవుతుందని బాధపడుతూ ఉండేవాడు. ఈ స్ప్రేయర్ ఉపయోగించటం మొదలు పెట్టి ఒక సంవత్సరం పైగానే అయినా ఎటువంటి మరమ్మత్తులకు మెకానిక్ దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా, తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పురుగు మందు పిచికారి చేసే పనులు కావటంతో ఆ రైతు మౌలాలితో ఎప్పుడూ రిపేర్లు రాకుండా, తక్కువ సమయంలో ఎక్కువ పొలాన్ని స్ప్రే చేసేలా మంచి స్ప్రేయర్ తయారు చేసి ఇచ్చావు అని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

సాంబశివరావు అనే రైతు ఉపయోగిస్తున్న స్ప్రేయర్‌ను చూసి ఆ గ్రామం మరియు చుట్టుపట్ల గ్రామాల రైతులు ఐదారు మంది వచ్చి మాకు కూడా ఇలాంటి స్ప్రేయర్ తయారు చేసి ఇవ్వమని కోరారు. వారి కోరిక మేరకు మొదట చేసిన స్ప్రేయర్ లో ఏవైనా చిన్న చిన్న లోపాలు ఉన్నా, వాటిని సరిచేసి అందరు రైతులకు స్ప్రేయర్లు తయారు చేసి ఇచ్చాడు. ఇంజన్ కూడా డబల్ పవర్‌తో పనిచేసే దాన్ని ఉపయోగించాడు. ఇప్పుడు పెద్ద పెద్ద కమతాలు ఉన్న రైతులందరూ తమకూ ఇలాంటి స్ప్రేయర్‌లు కావాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఈ స్ప్రేయర్ల తయారీలో  నిమగ్నమై ఉన్నాడు మౌలాలి.

మందు పిచికారి చేసే వ్యక్తి స్ప్రేయర్‌ను భుజానికి తగిలించుకుని బరువు మోయాల్సిన అవసరం లేకుండా 300 అడుగుల పైపు ఏర్పాటు చేయబడి ఉంటుంది. నాజిల్ రంధ్రాలు కూడా ఎక్కువ వెడల్పు కావటం వల్ల ఎటువంటి దుమ్ము ధూళి కణాలు ఇరుక్కునే అవకాశం ఉండదు. పొలం గట్టుపైన ఒక వ్యక్తి స్ప్రేయర్‌లో మందునీరు నింపుతూ ఉంటాడు. అలాగే పిచికారి చేసే వ్యక్తి పొలం లోకి పిచికారికి వెళ్ళేటపుడు పైపును వదులుతూ, రెండవ గట్టునుండి తిరిగి వచ్చేటపుడు పైపును లాగుతూ వుండటం వల్ల పిచికారి చేసే వ్యక్తి ఎలాంటి అలుపు లేకుండా పని చేస్తాడు. రెండు ఇన్‌పుట్‌ల ద్వారా మందు ద్రావణం

రైతులు తమకు మందు పిచికారి చేసేందుకు కూలీలు ఇప్పుడు ఆనందంగా చెప్పుకుం టున్నారు. ఎందుకంటే స్ప్రేయర్ మోయాల్సి న పని లేదు. కాకపోతే మందు పిచికారి చేసే వ్యక్తి వేగంగా నడవ గలిగేవాడై ఉంటే చాలు. అంటే యువకులు అయితే బావుంటుం ది. ఎందుకంటే మందు వేగంగా పిచికారి చేయబడుతుంది




రావ టం, పెద్ద రంధ్రం వున్న నాజిల్ ద్వారా స్ప్రే చేయబడుతుంది. కాబట్టి ఎక్కువ వత్తిడితో, ఎక్కువ దూరంలో స్ప్రే చేయబడుతుంది. వచ్చే సీజన్‌కల్లా తమకు స్ప్రేయర్లు తయారు చేసి ఇవ్వమని చాలా మంది రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో స్ప్రేయర్లను తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నాడు.

ఈ స్ప్రేయర్‌ను ఉపయోగిస్తున్న రైతులు తమకు మందు పిచికారి చేసేందుకు కూలీలు ఇప్పుడు ఆనందంగా చెప్పుకుం టున్నారు. ఎందుకంటే స్ప్రేయర్ మోయాల్సిన పని లేదు. కాకపోతే మందు పిచికారి చేసే వ్యక్తి వేగంగా నడవ గలిగేవాడై ఉంటే చాలు. అంటే యువకులు అయితే బావుంటుంది. ఎందుకంటే మందు వేగంగా పిచికారి చేయబడుతుంది కాబట్టి త్వరగా నడుస్తూ పిచికారి చేయాల్సి ఉంటుంది. 5 ఎకరాల మాగాణి పొలం కూడా ఒక గంట లోపే పిచికారి చేసుకోవచ్చు. అదే సాధారణ స్ప్రేయర్ అయితే బరువు మోనస్తూ నిదానంగా బురదలో తిరుగుతూ దాదాపు ఒక రోజంతా మందు పిచికారి చేయాల్సి వచ్చేది. ఇప్పుడా సమస్య తీరిపోవటంతో ఆ ప్రాంత రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ స్ప్రేయర్ రెండు మోడళ్ళలో లభిస్తుంది. మొదటిది ఎఫ్-747, రెండోది ఎఫ్‌టి787. రెండో స్ప్రేయర్‌లో ఆర్‌పియం (ఇంజను తిరిగే వేగం) ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఇంకా ఎక్కువ ఫోర్సులో మందు పిచికారి చేయబడుతుంది. రెండింటి ధరలో కేవలం రూ. 500 మాత్రమే తేడా ఉంటుంది.

ఇటీవల గుంటూరు ల్యామ్‌ఫాంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఈ స్ప్రేయర్‌ను చూసిన చాలామంది రైతులు, వ్యవసాయ శాస్త్ర వేత్తలు ఇన్నోవేటర్ మౌలాలిని అభినందించారు. పల్లెసృజన నిర్వహించే వారం వారం వెబినార్లలో 62వ వెబినార్‌లో మౌలాలి తన ఇన్నోవేషన్‌ను ప్రదర్శించి ఎంతోమంది మన్ననలు పొందాడు. వచ్చే సీజన్ నాటికి ఈ స్ప్రేయర్ అందరు రైతులకు అందుబాటులోకి తీసుకు రావటానికి మౌలాలి చేస్తున్న ప్రయత్నానికి 'పల్లె సృజన' తన పూర్తి సహకారాన్ని అందిస్తోంది.



**ఇన్నోవేటర్ మౌలాలి ఫోన్ : 9948053104**

# ఇన్నోవేషన్లే జీవితంగా మార్చుకున్న అసామాన్యుడు
# తోట కృష్ణ భగవాన్



ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా, పోలవరం గ్రామానికి చెందిన వెంకయ్య, అనువాయమ్మ దంపతులకు 1946లో జన్మించాడు కృష్ణ భగవాన్. ఏడేళ్ళ వయసులోనే తన కుటుంబం బ్రతుకుతెరువు కోసం మచిలీపట్నం వలస వెళ్ళారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఏడవ తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పాడు. పెద్దగా చదువుకోలేదు కానీ, అతనికున్న పట్టుదల, ఆత్మ విశ్వాసం ఆయనను ఇన్నోవేటర్‌ను చేశాయి. కూలీగా జీవితం ప్రారంభించి, మేస్త్రీగా మారి, అంచలంచలుగా ఎదుగుతూ యంత్రాలను రూపొందించే స్థాయికి చేరుకున్నాడు "తోట కృష్ణ భగవాన్".

**మెకానికల్ రంగంలోకి అడుగు:**

మచిలీపట్నంలో కొల్లి హనుమంతరావు అనే యజమాని వద్ద లేత్‌మిషన్ పని నేర్చుకున్నాడు. ఏ పని అప్పజెప్పినా వెంటనే గ్రహించి, త్వరగా నేర్చుకోగల సమర్థుడు అని ప్రశంసలు పొందాడు. అతని సామర్థ్యంతో 1958లో ఆర్‌డిఎల్. నరసింహ మూర్తి గారి సైంటిఫిక్ సంస్థలో ఉద్యోగం సంపాదించాడు. అక్కడ ఒక్క ఏడాదిలనే మంచి అనుభవం సంపాదించి, ఆ తర్వాత బి.ఇ.ఎల్. సంస్థలో మేస్త్రిగా చేరి మరో మెట్టు ఎక్కాడు. అక్కడ మిల్లింగ్ మెషిన్‌మీద మైక్రోస్కోప్ మెటల్ బాడీలు మరియు దాని భాగాల తయారీలో పాల్గొన్నాడు. అక్కడ చిలంకుర్తి నారాయణరావు అనే ఇంజనీర్ ఇతనిలోని పని నేర్చుకోవాలి అన్న తపనను గమనించి వెన్నుతట్టి ప్రోత్సహించారు. చాలీ చాలని నూట యాభై రూపాయల జీతంతోనే అలా పదేళ్ళు పని చేశాడు కృష్ణ భగవాన్. తన ఆర్థిక పరిస్థితిని అధిగమించేందుకు తీరిక సమయాల్లో కుర్చీలు, మంచాలకు, సైకిల్ బుట్టలకు ప్లాస్టిక్ వైర్‌ను వినూత్నంగా అల్లే పని చేసి అందులోనూ మంచి పేరు సంపాదించుకున్నాడు.

కృష్ణ భగవాన్‌కు భార్య శ్రీమతి వెంకట రమణ అన్ని కష్టాలలో తోడుగా నిలిచింది. వీరికి ముగ్గురు సంతానము. వాసుదేవరావు, చంద్రమౌళి అనే ఇద్దరు కొడుకులు, భారతి అనే కూతురు. కొడుకులు ఇద్దరూ ఇతని బాటలోనే పయనించి, ఇతనితోపాటు కష్టపడుతూ మరెన్నో యంత్రాలకు రూపకల్పన చేయడంలో సిద్ధహస్తులయ్యారు.

**సొంత వర్క్‌షాప్ ప్రారంభం:**

కృష్ణ భగవాన్ సోదరుడు రామచంద్రరావుకు 'ఉమా గోల్డ్ కవరింగ్ వర్క్స్' అనే షాపు యజమాని తన అన్న చేస్తున్న ప్రతి ప్రయత్నాన్ని ఎంతో ప్రోత్సహించేవాడు. 1969లో తన మరో సోదరుడు తులసీ రామ్‌తో కలిసి ఐదువేల రూపాయల పెట్టుబడితో ఒక డ్రిల్లింగ్ మిషన్, లేత్ మిషన్, వెల్డింగ్ మిషన్‌లను కొనుక్కొని స్వంత వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసుకుని యంత్రాలకు మరమ్మత్తులు చేసే పని ప్రారంభిం చారు. ట్రాక్టర్లను రిపేరు చేయడం, బయట మార్కెట్‌లో లభించని కొన్ని విడి భాగాలను స్వంతంగా తయారు చేయటం లో మంచి పేరు గడించింది ఇతని వర్క్‌షాప్.

అలా పని చేసుకుంటున్న సమయంలో ఇతని వెల్డింగ్ మిషన్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ వైండింగ్ కాలిపోయింది. దాన్ని రీ వైండింగ్ చేయించాలంటే మూడు వేలు అవుతుందన్నారు. అంత డబ్బు వెచ్చించలేక తానే వైండింగ్‌ను జాగ్రత్తగా గమనించి, అందుకు అవసరమైన రాగి తీగ (కాపర్ వైర్)ను కొనుగోలు చేసి, తానే స్వయంగా రీవైండింగ్ చేసుకున్నాడు. అలా ప్రారంభమైన కొత్త పని ఫ్యాన్ యొక్క సింగల్ ఫేస్, త్రీ ఫేస్ మోటార్‌ల వైండింగ్ చేయటం, మరమ్మత్తులు లాంటి పనులు చేయటం మొదలు పెట్టాడు.

**పచ్చి పాల నుండి వెన్న తీసే యంత్రం రూపకల్పన:**

అప్పట్లో పచ్చి పాల నుండి వెన్న తీయటానికి యూరప్ నుండి దిగుమతి చేసుకున్న యంత్రాలను ఉపయోగించేవారు. కానీ అవి పాడైతే వాటిని మరమ్మత్తులు చేసేవారు అందుబాటులో ఉండేవారు కాదు. 1969లో ఆనోటా, ఈ నోటా కృష్ణ భగవాన్ గురించి తెలుసుకున్న వినియోగ దారులు ఇతని వద్దకు వచ్చి తమ యంత్రాలకు మరమ్మత్తులు చేయించుకునేవారు. అరకొరగా వచ్చే పనులతో ఆయన ఆర్థిక ఇబ్బందు



పునర్ నిర్మించుకున్న మోటార్ సైకిల్

లు గట్టెక్కలేదు. ఇలా కాదని 1972లో పచ్చి పాల నుండి వెన్న తీసే యంత్రాన్ని మన భారత దేశంలోనే ఎందుకు తయారు చేయకూడదు అని అనుకుని అప్పట్లోనే "మేకిన్ ఇండియా" ను రాష్ట్రంలో ఈయనే తొలిసారిగా పచ్చి పాలనుండి వెన్న తీసే యంత్రాన్ని తయారు చేశాడు.

**1953 మోడల్ ఇంగ్లాండ్ మోటార్ సైకిల్ 'వెలాసిటీ' పునర్ నిర్మాణం:**

1974లో తన వ్యాపారం వృద్ధి చెందటంతో ఒక సెకండ్ హ్యాండ్ మోటార్ సైకిల్ కొందామని అనుకున్నాడు. కానీ దానికి కూడా అవసరమైన డబ్బు తనవద్ద లేదు. పనిమీద రాజమండ్రి వెళ్ళినపుడు పాత సామాన్లు (స్క్రాప్)లో పడివున్న వెలాసిటీ మోటార్ సైకిల్ విడి భాగాలను మూట కట్టి ఉండటం చూసాడు. వాటిని వెంటనే కొనుగోలు చేసి, అందులో అవసరమైన, మార్కెట్‌లో లభించని విడి భాగాలను తానే స్వయంగా తయారు చేసుకుని మోటార్ సైకిల్‌ను పునర్ నిర్మించాడు. ఈ బైక్‌లో కారు మాదిరిగానే హ్యాండ్ గేర్, రేడియేటర్, హ్యాండ్ ఆపరేటెడ్ స్టార్ట్ రాడ్ ఉన్నాయి. 2020లో అతను అదే మోటార్ సైకిల్‌ను మరింత సౌకర్యవంతంగా ఉండేలా బ్యాటరీతో పని చేసేలా మార్పు చేశాడు. ఈ మోటార్ సైకిల్‌పై వెళ్తున్నపుడు రోడ్డు వెంట వెళ్ళే వాళ్ళు ఈ వాహనాన్ని చూసి ఆశ్చర్యపోతుంటారు.

**వృత్తిగా మార్చుకున్న యంత్రాల ఆవిష్కరణ మరియు తయారీ:**

బట్టల సబ్బులను తయారు చేసేందుకు అవసరమైన యంత్రాన్ని రూపొందించి, తానే స్వయంగా సబ్బులను తయారు చేసి, మార్కెట్‌లో విక్రయించేవాడు. అదేవిధంగా మినప అప్పడాలు తయారీ యంత్రము తయారు చేసి, అప్పడాలను విక్రయించేవాడు. కానీ సహాయకులు లేకపోవటంతో ఆ వ్యాపారాలు కొనసాగించలేక పోయాడు. ప్రతి వ్యాపారానికి వాటిని మార్కెటింగ్ చేయటం చాలా పెద్ద సమస్య కాబట్టి తాను కేవలం యంత్రాలను తయారు చేసి విక్రయిస్తే చేతనైన వారు వాటి నుండి ఉత్పత్తులను చేసుకుని విక్రయించుకుంటారు కదా అని ఆలోచించి, కేవలం యంత్రాలను తయారు చేసి వాటిని విక్రయించడం మొదలు పెట్టాడు. ఈ ఆలోచనే అతని జీవిత గమనాన్ని మార్చేసింది.

**యంత్రాల ఉత్పత్తికి అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవటం:**

తన వర్క్‌షాప్‌కు అవసరమైన హైడ్రాలిక్ మిషన్ తయారు



తనకోసం తాను తయారు చేసుకున్న
హైడ్రాలిక్, షీట్ బెండింగ్, సిలిండర్/ కోన్ మేకింగ్ యంత్రాలు



గాజులు, వడ్డాణాలు డిజైన్ చేసే యంత్రం & రోలర్లు

చేసుకునేందుకు రాత్రింబవళ్ళు శ్రమించి, ఎన్నో వైఫల్యాలను ఎదుర్కొని చివరకు విజయం సాధించాడు. ఈ హైడ్రాలిక్ మిషన్లు ఇనుప కడ్డీలు (రాడ్‌లు), ఇనుప రేకులు (ఐరన్ షీట్) కావలసిన విధంగా వంచడానికి ఉపయోగిస్తారు. ఐరన్ షీట్లను స్థూపాకారం మరియు శంఖు ఆకారం లోకి సులభంగా వంచడానికి కూడా యంత్రాలను తయారు చేసుకున్నాడు. లేత్ మిషన్ ద్వారా యంత్రాలకు కావలసిన విడి భాగాలను సులభంగా తయారు చేసుకునేలా తన యంత్రాలను అభివృద్ధి చేశాడు.

**రోల్డ్ గోల్డ్ నగల తయారీలో ఆవిష్కరణలు:**

మచిలీపట్నంలో ప్రసిద్ధి చెందిన రోల్డ్ గోల్డ్ గాజులు, చెవి రింగులు, వడ్డాణం మరియు అరవంకీలు, మెటల్ తీగలపై వివిధ రకాల డిజైన్‌లను చెక్కడం కొరకు వివిధ రకాల యంత్రాలు మరియు రోలర్‌లను తయారు చేశాడు. కృష్ణ భగవాన్ తయారు చేసిన యంత్రాలను ఉపయోగించి ఎంతోమంది మహిళలు ఇంట్లో ఉండి రోల్డ్ గోల్డ్ నగలను తయారు చేసే వృత్తిని చేపట్టేలా ఇతని ఇంత్రాలు ఉపయోగపడ్డాయి.

'వలకసర్లు' అనే ఆభరణాలు తయారు చేయాలంటే 14 రకాల కోణాలు ఉంటాయి. వీటిని చేత్తో తయారు చేయాలంటే చిన్న లోహపు ముక్కను సూదిలోకి ఎక్కించుకొని దాన్ని తిప్పుతూ, సుత్తితో 14 దెబ్బలు వెయ్యాలి. దీనివలన ఈ పని చేసేవారికి భుజాల నొప్పి వచ్చేది. అలాగే ఎంతో సమయం కూడా పట్టేది. ఇతను తయారు చేసిన యంత్రం ద్వారా 'వలకసర్లు' కేవలం నాలుగు దెబ్బలతోనే తయారు చేయవచ్చు. దీనివల్ల ఎంతోమంది శ్రమ, సమయం ఆదా కావటంతో ఉత్పత్తి పెరిగేలా చేశాయి ఇతని యంత్రాలు. అలాగే రోల్డ్ గోల్డ్ గాజులు తయారు చేయాలంటే వాటిని అతికించేందుకు టంకం ముక్కలను ఉపయోగిస్తారు. ఇందుకు అవసరమైన సాదా షీట్ నుంచి చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించుకునేందుకు కూడా ఒక యంత్రాన్ని తయారు చేశాడు. 1998లో 1.5 మి.మీ. నుండి 3.5 మి.మీ. వ్యాసం కలిగిన మెటల్ తీగ చుట్టూ ఐదు డైమండ్ ఆకారపు నమూనాను చెక్కగల యంత్రాన్ని కనుగొన్నాడు. ఈ మెటల్ వైర్‌ను చిన్న చిన్న ముక్కలుగా చేసి, చెవి పోగులు చేయడానికి ఉపయోగిస్తారు. ఈ చెవి పోగులు, డైమండ్ ఇయర్ రింగ్స్‌కు మచిలీపట్నం చాలా ప్రసిద్ధి చెందింది.

**మానవ శ్రమను తగ్గించే యంత్రాలకు చిరునామాగా మారిన వైనం:**

శ్రామికుల శ్రమను తగ్గించడానికి ఎంతోమంది కృష్ణ భగవాన్‌ను సంప్రదించి, అతని సహాయం పొందేవారు. ఏ పనైనా సరే



బాదంపాలు చిలికే యంత్రం



మిక్సర్



వైబ్రేటర్


అంబికా సంస్థకు అందించిన సాంకేతిక పరిజ్ఞానం

అందులో శ్రమను తగ్గించేందుకు ఇతను చేసి యంత్రాలు విశేషంగా ప్రశంసించ బడ్డాయి. ఇతని యంత్రాల తయారీలో తను డబ్బుకన్నా, శ్రామికుల శ్రమను తగ్గించడం, వారి ఉత్పత్తిని పెంచడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు కృష్ణ భగవాన్. ఇతని పనితీరు, క్రమశిక్షణ ఎంతోమందికి స్పూర్తినిచ్చింది.

కృష్ణ భగవాన్ పనితనాన్ని గురించి తెలుసుకున్న ఒక టింబర్ డిపో యజమాని ఇతన్ని సంప్రదించి, కట్టెలు చీల్చడానికి పనివారు రావటం చాలా కష్టంగా ఉంది, ఈ సమస్య నుండి నన్ను గట్టెక్కించేలా ఏదైనా పరిష్కారం చూపండని కోరాడు. అప్పుడు అతనికి అవసరం తీర్చడానికి ఒక యంత్రం తయారు చేయటంతో, ఒక వారం రోజులు చేసే పని కేవలం రెండు రోజుల్లోనే పూర్తయ్యేలా చేశారు. ఈ యంత్రం తయారీతో పనివారు కూడా ఎంతో ఉత్సాహంగా పని చేస్తున్నారని టింబర్ డిపో యజమాని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆఫ్ సెట్ ముద్రణా రంగంలో కూడా వైవిధ్యమైన యంత్రాలను తయారు చేశాడు.

ఒక దంత వైద్యుని సంప్రదించడానికి వెళ్ళినపుడు అక్కడ జరుగుతున్న పనులను చూసి, వారికి అవసరమైన వైబ్రేటర్ ను తయారు చేసి ఇవ్వగా ఆ దంత వైద్యుడు ఎంతో ఆశ్చర్యానికి గురయ్యాడు. గ్యాస్ పొయ్యిమీద నీళ్ళు కాచుకునే బదులు ఎలక్ట్రిక్ గీజర్ లాగా గ్యాస్ గీజర్‌ను తయారు చేసుకున్నాడు. ఇరుగు పొరుగు వారు, బంధువులు తమకూ ఇలాంటి గీజర్ చేసివ్వమని కోరగా చాలా మందికి తక్కువ ఖరీదులో గ్యాస్ గీజర్ తయారు చేసి ఇచ్చాడు.

హెూటల్ యజమానులకు చట్నీలు, అల్లం వెల్లుల్లి పేస్టు, కారం దంచటానికి ఒక మిక్సి. మార్కెట్లో లభించే మిక్సి వల్ల ఏర్పడే సమస్యల నుండి పరిష్కారంగా హైస్పీడ్ మిక్సీని తయారు చేసి ఇచ్చాడు. దీనిని ఇంట్లో వాడే మిక్సీకన్న సులభంగా సౌకర్యవంతంగా ఉపయోగించుకోవచ్చు. ఇలాంటి వాటిని మచిలీపట్నం లోని చాలా హెూటళ్ళలో వినియోగిస్తున్నారు.


బూందీ & మోతీచూర్ బూందీ తయారు చేసే యంత్రం




బాదం పాలు తయారు చేసే వారికోసం ఒక యంత్రం, ఆవు పేడతో ధూప్ స్టిక్స్ తయారు చేసేందుకు ఒక యంత్రం, ఇలా ఎవరు ఏ సమస్యతో తనవద్దకు వచ్చినా సరే వాటికి తగిన యంత్రాన్ని తయారు చేసి ఇచ్చాడు.

**అంబికా సంస్థకు సాంకేతిక పరిజ్ఞానం:**

1994లో అగరు బత్తీల వ్యాపారంలో ప్రముఖమైన అంబికా సంస్థ మరియు అరోమా ఇండస్ట్రీస్ కొరకు అగర బత్తీలు, ధూప్‌స్టిక్స్, కప్పు ధూప్‌ల తయారీకి కావలసిన వినూత్న యంత్రాలను తయారు చేశాడు. మొదట సెమీ ఆటోమేటిక్ మిషన్ తయారు చేసి ఇచ్చి, ఆ తర్వాత దాన్ని ఆటోమాటిక్ మిషన్‌గా అభివృద్ధి చేశాడు. వారికి అవసరమైన ఎన్నో రకాల యంత్రాలను తయారు చేసి మానవ శ్రమ తగ్గేలా, నాణ్యత పెరిగేలా చేశాడు.

**మిఠాయిలు, తినుబండారాలు తయారీ యంత్రాల రూపకల్పన:**

2014లో మిఠాయిలు, తినుబండారాలను తయారు చేసే కార్ఖానాల కొరకు సరసమైన పరికరాలైన బూందీ, మోతీచూర్-బూందీ, రకరకాల కారప్పూసలు తయారు చేసేందుకు యంత్రాలను తయారు చేశాడు. ఆ పదార్థాలు యంత్రం నుండి నేరుగా పొయ్యిమీద వున్న కడాయిలో పడేలా ఏర్పాటు చేసి, శ్రామికుల కష్టాన్ని తీర్చాడంతో పాటు,


కారప్పూస తయారు చేసే యంత్రం

ఉత్పత్తి అధికమయ్యేలా చేశాడు. ఆహార పదార్థాల తయారీ కర్మాగారాల కోసం ఇంకా నాలుగు రకాల లడ్డూలు తయారు చేసే యంత్రాలను, చెకోడీలు చెక్కలను తయారు చేసే యంత్రం, బాదుషా మిఠాయి తయారీ సే యంత్రం, వేరుశనగ, నువ్వుల లడ్డూలు చేసే యంత్రం, ఇలా ఎన్నింటినో తయారు చేసి ఇచ్చాడు.

మార్కెట్లో ఉసిరి గింజలను వేరు చేసి, తొనలుగా విభజించేందుకు ఖరీదైన యంత్రాలు ఉన్నాయి, అవి కూడా సెమీ ఆటోమేటిక్ యంత్రాలు. కానీ కృష్ణ భగవాన్ వినియోగదారులకు అందుబాటు ధరలో లభించేలా ఆటోమేటిక్ యంత్రాన్ని రూపొందించాడు.

**కృష్ణ భగవాన్ మాటల్లో కొన్ని.....:**

"ఎటువంటి సమస్యలకైనా పరిష్కారం సాధించేందుకు మనం ఎల్లప్పుడూ శాయశక్తులా కృషి చేస్తూనే ఉండాలి" అన్న మా నాన్నగారి సిద్ధాంతాన్ని నేను కూడా అనుసరిస్తున్నాను. శ్రమను నమ్ముకుంటే భవిష్యత్తుకు తిరుగు లేదు. నిరంతరం ఆలోచన, సాధించాలనే తపన, ఆత్మ విశ్వాసం వుంటే ఎవరైనా విజయం సాధించ గలరు. కూలీగా పని చేస్తూ ఇల్లు గడవడానికి చాలా ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు నేనే కొంతమందికి ఉద్యోగాలు కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఉత్సాహంగా పని చేయటమే నాకు తెలిసిన విద్య అని వినమ్రంగా అంటాడు కృష్ణ భగవాన్.



పప్పు చెక్క, చెకోడీలు చేసే, మైదా/ బాదుషా ముక్కల కటింగ్ యంత్రాలు



బెల్లం తురిమే యంత్రం

ఉసిరి గింజలు వేరుచేయు యంత్రం

ప్రస్తుతం ఈయనకు 80 దశకంలోకి అడుగిడుతున్నా అలసిపోని మనస్తత్వంతో ఇప్పటికీ ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపే ఇన్నోవేషన్లు చేయిస్తూనే ఉన్నాడు. ఒక రంగంలో కాకుండా ఎన్నో రకాల రంగాలు, ముఖ్యంతా ఆహార పదార్థాల పరిశ్రమకు చెందిన చాలా ఇన్నోవేషన్లు చేశాడు, చేస్తూనే ఉన్నాడు కృష్ణ భగవాన్.

ఇన్నోవేషన్నే జీవిత విధానంగా ఎంచుకున్న కృష్ణ భగవాన్ గారు ఈ కాలపు యువతకు ఒక ఆదర్శం. ఎన్ని సమస్యలు పరిష్కరించాడో, ఎంతోమంది శ్రమను తగ్గించాడో, దేశ ఆర్థిక వ్యవస్థను ఎంత పెంచాడో, ఎంతమంది కళ్ళల్లో ఆనందాన్ని, మనసునిండా కృతజ్ఞతను చూశాడో....!!!. అలసిపోని ఇన్నోవేటర్ కృష్ణ భగవాన్ గారికి తలవంచి వినమ్ర నమస్కారాలు. కృష్ణ భగవాన్ గారిని జాతీయ స్థాయిలో గుర్తించాల్సిన అవసరం ఉంది. దేశానికి ఆయన క్రియాశీలతను, పట్టుదలను, మానవత్వపు విలువలను చాటి చెప్పాలి. 'పల్లెసృజన' దీనికై పూర్తిగా కృషి చేస్తుంది.

కృష్ణ భగవాన్ మనవడు (పృథ్విరాజ్) ఫోన్ నెం. **9866211467**

**కృష్ణ భగవాన్ ఆవిష్కరించిన కొన్ని యంత్రాలు....**

| యంత్రం పేరు | ఉత్పత్తి సామర్థ్యము | మోటార్ అవసరం | విస్తీర్ణం (అడుగులు) |
|---|---|---|---|
| బూందీ & మోతీచూర్ బూందీ | 50–60 కిలో/గం. | 1/2 హెచ్.పి. | ట్రాలీతో 2x2 |
| రకరకాల కారప్పూస | 40–50కిలో/గం. | 1/2 హెచ్‌పి | ట్రాలీతో 2x3 |
| సున్నుండలు | 80 కిలో/గం. | 1 హెచ్‌పి | 3x2.5 ఒక రోలర్ సెట్ 2x2.5 |
| సాదా (బందర్) లడ్డూ, కొబ్బరి లడ్డూ | 35 గ్రా. లడ్డు 100 కిలో/గం. | రెండు 1/4 హెచ్‌పి & రెండు 1/2 హెచ్‌పి | 8x2.5 |
| వేరుశనగ/ నువ్వుల లడ్డూ | 40 కిలో/గం. | 1/2 హెచ్‌పి | 3x3 |
| బూంది లడ్డూ | 35 గ్రా. లడ్డు 90 కిలో/గం. | రెండు 1/2 హెచ్‌పి | |
| చకోడి | 60–65 కిలో/గం. | 1 హెచ్‌పి | 2x3 |
| చెక్కలు | 80 కిలో/గం. | 1/2 హెచ్‌పి | 2x3 |
| బాదుషా | 35 గ్రా. ముద్ద 70 కిలో/గం. | 1/4 + 1/2 హెచ్‌పి | 3x3 |
| ఖాజా | 450 ముక్కలు/ని. (3 వరసలు) | 1/2 హెచ్‌పి | 2x8 |
| బెల్లం తురమడానికి 70 కిలో/గం. | 1 హెచ్‌పి | 3జ4 | |
| నెయ్యి – గోదాడిను వేరు చేయడానికి | 15 కిలోలు/ప్రెస్ (10 ని.) | 1 హెచ్‌పి | 4x2.5 |
| ఉసిరి & దాని గింజలను వేరు చేయడానికి | 30–35 కిలో/గం. | 1/2 హెచ్‌పి | 3x5 |
| కట్టెలు చీల్చడానికి | 2 రోజుల్లో ఒక వారం పని చేస్తుంది | 2 హెచ్‌పి | 2.5x10 |
| బాదం పాలు కలిపేందుకు | డబుల్ జార్, ఒక్కొక్కటి 40 లీ. | 1/2 హెచ్‌పి | 2.5x2.5 |
| హోటల్ మిక్సర్ | 3 కిలో/3 ని. | 2200 వాట్స్ | 2x2 |
| వైబ్రేటర్ | ... | 1/4 హెచ్‌పి | 1.5x1.5 |
| స్టీల్ పైప్ స్పైరల్లా చుట్టేందుకు | ... | 1 హెచ్‌పి | 2x3 |

## వేలాది మంది విద్యార్థులను ప్రకృతి ప్రేమికులుగా మారుస్తున్న

# ప్రకృతికి దొరికిన వరం 'కొమెర జాజి'





ఒక్కొక్కరికి ఒక్కో సంఘటన తమ జీవిత గమ్యాన్నే మార్చేస్తుంది అన్న విషయం అందరికీ తెలుసు. అంతవరకు తాము పయనిస్తున్న గమ్యం లేని ప్రయాణానికి కొన్ని సంఘటనలు ప్రేరేపితవై తమ గమనాన్నే మార్చేస్తుంటాయి. అలాంటి సంఘటనకు కారణం అయింది 'పల్లెసృజన' అని సగర్వంగా చాటుకునే వ్యక్తి కొమెర జాజి. చిన్న వయసులోనే తన గ్రామంలోని ఒక సాంప్రదాయ వైద్యుడు చేస్తున్న వైద్యాలకు ముగ్ధుడై, ఆ వైద్యం పట్ల మక్కువ పెంచుకుని, తనకు తెలియకుండానే తాను శిష్యుడై పోయాడు. తన గురువు ప్రతిభ సమాజానికి విస్తృతంగా తెలియజేయాలి అన్న ఉద్దేశ్యంతో 'పల్లెసృజన' ద్వారా తన గురువు ప్రతిభను చాటాను అనుకున్నాడు. కానీ, అదే తన జీవన గమ్యాన్ని మారుస్తుందని తానే ఊహించలేక పోయాడు. అలాంటి ఒక ప్రకృతి ప్రేమికుడి కథను మనం తెలుసుకుందాం.....

పుస్తకాలు, మార్కులు, నాలుగు గోడల మధ్య చదువులు ప్రస్తుత విద్యార్థి లోకాన్ని ప్రకృతి నుండి దూరంగా నెట్టివేస్తున్నాయి. అలాంటి నేటి ప్రపంచంలో 'ప్రకృతికి దొరికిన వరం' అయ్యాడు గుంటూరు జిల్లా, కారంపూడి గ్రామానికి చెందిన 30 సంవత్సరాల యువకుడు "కొమెర జాజి". 2018లో పల్లెసృజన స్ఫూర్తితో ప్రకృతి పాఠాలు నేర్చుకోవాలని ఎందరో సాంప్రదాయ వైద్యుల వద్ద శిష్యరికం చేసి, మానవాళిని, పశు పక్ష్యాదులను ఆరోగ్యంగా ఉంచే శక్తి ప్రకృతిలోనే మమేకమై ఉందని తెలుసుకున్నాడు. తాను నేర్చుకున్న సాంప్రదాయ మూలికా వైద్యంతో కేవలం మనుషులు, పశు పక్ష్యాదుల రోగాలను నయం చేసేం దుకు ఎంతోమంది ఉన్నారు, వారిలా తానూ ఒక వైద్యు డిగా మిగిలి పోవటం తనకు ఇష్టం లేక, తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలన్న తపనతో ఎంచుకున్నదే "ప్రకృతి పాఠశాల".



వైద్యం పట్ల మక్కువ పెంచుకుని, తనకు తెలియకుండానే తాను శిష్యుడైపోయాడు. తన గురువు ప్రతిభ సమాజానికి విస్తృతంగా తెలియజేయాలి అన్న ఉద్దేశ్యంతో 'పల్లెసృజన' ద్వారా తన గురువు ప్రతిభను చాటాను అనుకున్నాడు. కానీ, అదే తన జీవన గమ్యాన్ని మారుస్తుందని తానే ఊహించలేక పోయాడు. అలాంటి ఒక ప్రకృతి ప్రేమికుడి కథ

మొదట తన సమీప గ్రామాల్లోని, పట్టణా ల్లోని పాఠశాలలకు వెళ్ళి అక్కడ ప్రధాన అధ్యాపకులతో మమేకమై తన భావాన్ని తెలియజేసి, వారిని ఒప్పించి "పాఠశాల పిల్లలకు కేవలం పాఠ్య పుస్తకాల చదువులే కాదు, ప్రకృతి నుండి కూడా పాఠాలు నేర్పించాలి అని చెప్పి వారిని ఒప్పించాడు. ప్రకృతి ధర్మాలను, అది మానవాళికి అందిస్తున్న విలువైన మూలికలు, ఆకులను గురించి ప్రత్యక్షంగా తెలుసుకునేలా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నాడు. తనను ఎంతోమంది ప్రకృతి పట్ల ఏమిటీ పిచ్చి అని హేళన చేసినా, తనకంటూ ఓ ప్రత్యేకత ప్రకృతి ద్వారానే సాధించడంతో పాటు, ప్రకృతిని గురించి మరచిపోతున్న లోకానికి సరికొత్త భాష్యంతో ముందుకు వెళ్ళాలని కంకణం కట్టుకున్నాడు".

ప్రస్తుతం అతని పరిసర పాఠశాలలే కాదు, ఉభయ రాష్ట్రాల లోని ఎన్నో పాఠశాలల అధ్యాపకులు, యాజమాన్యం కొమెర జాజిని తమ పాఠశాలకు వచ్చి, తమ విద్యార్థులకు ప్రకృతిని గురించిన పాఠాలు నేర్పాలని ఆహ్వానాలు పంపే స్థాయికి చేరుకున్నాడు. తాను వెళ్ళే ప్రతి పాఠశాల విద్యార్థులకు ప్రకృతిని గురించి తరగతి గదిలో మొదట బోధిస్తాడు. ఆ తర్వాత వారిని సమీపంలోని వనా లు, అడవులను తీసుకు వెళ్ళి విద్యార్థులు ప్రకృతి ఇస్తున్న అందాలు, మూలిక లు,








ఆకులను ప్రత్య క్షంగా చూసి, స్పర్శించి తెలుసుకునేలా చేస్తున్నా డు. అలా చేయటం వల్ల వారి మదిలో శాశ్వ తం గా ముద్ర పడిపోయేలా తీర్చి దిద్దుతున్న గొప్ప 'ప్రకృతి ప్రేమికుడు' కొమెర జాజి. వెళ్ళిన ప్రతి పాఠశాలలో ప్రకృతిని గురించి, 'పల్లెసృజన' చేస్తు న్న కృషిని గురించి తెలియజేస్తూ వారికో కొత్త ప్రపంచాన్ని చూపుతున్నాడు. వెళ్ళిన ప్రతి పాఠశా ల అధ్యాప కులకు 'పల్లెసృజన' చందాదారులు కండి నూతన ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వచ్చే కార్య క్రమంలో భాగస్వాములు కావాలని కోరుతాడు. విద్యార్థులచే జై ప్రకృతి తల్లికి, జై పల్లెసృజనకు అంటూ వారిచేత జేజేలు పలికిస్తున్న కొమర జాజిని ప్రకృతి పట్ల కార్యోన్ముఖుడిని చేసిన ఘనత దక్కించుకుంది 'పల్లెసృజన' పత్రిక.

**"పాఠశాల పిల్లలకు కేవలం పాఠ్య పుస్తకాల చదువులే కాదు, ప్రకృతి నుండి కూడా పాఠాలు నేర్పించాలి అని చెప్పి వారిని ఒప్పించాడు. ప్రకృతి ధర్మాలను, అది మానవాళికి అందిస్తున్న విలువైన మూలికలు, ఆకులను గురించి ప్రత్యక్షంగా తెలుసుకునేలా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నాడు. తనను ఎంతో మంది ప్రకృతి పట్ల ఏమిటీ పిచ్చి అని హేళన చేసినా, తనకంటూ ఓ ప్రత్యేకత ప్రకృతి ద్వారానే సాధించడంతో పాటు, ప్రకృతిని గురించి మరచిపోతున్న లోకానికి సరికొత్త భాష్యంతో ముందుకు వెళ్ళాలని కంకణం కట్టుకున్నాడు"**

రాష్ట్ర వ్యాప్తంగా ఒక లక్ష మంది విద్యార్థులకు ప్రకృతి గురించి వాటి ఉపయోగాలు, వన మూలికలు మనకు ఎలా మేలు చేస్తాయో చెప్పి, ప్రకృలోకి తీసుకెళ్ళి రకరకాల మొక్కలు చూ పించి, వాటి ఔషధ విలువలు ప్రత్యక్షంగా తెలుసుకునేలా చేస్తున్నాడు. విద్యార్థులచే కోటి మొక్కలు నాటించడమే ప్రకృతి పాఠశాల ముఖ్య ఉద్దేశ్యం అని సగర్వంగా చెబుతా డు కొమెర జాజి. ప్రస్తుతం ఇతని ప్రకృ తి పాఠాలు పాఠశాలల స్థాయి నుండి కళాశాలలు, విశ్వ విద్యాలయాల వరకు చేరుకుంది.

తన ప్రకృతి పాఠాలను విద్యార్థులకు తెలియజేయటంతో పాటు, తాను కూడా వెళ్ళిన ప్రతి గ్రామంలో ప్రకృతితో మమేకమై జీవిస్తున్న కొందరు ప్రత్యేక నైపుణ్యం కల వారిని కలిసి ఎన్నెన్నో కొత్త కొత్త మొక్కలు, వాటి ఔషధ గుణాలను గురించి కూడా తానూ తెలసుకుంటూనే ఉంటాడు.

ప్రకృతి మూలికా సేకరణ నిపుణుడిగా ఇతని సేవా తత్పరతకు గుర్తింపుగా "ఆసియా వేదిక్ విశ్వవిద్యాలయం, చెన్నయ్" వారు 'గౌరవ డాక్టరేట్"తో సత్కరించడం జరిగింది. 'సుచిరిండియా ఫౌడేషన్ వారు 28 నవంబర్, 2021న రవీంద్ర భారతిలో 'సంకల్ప తార' పురస్కారంతో సత్కరించారు. ఇంకా ఎంతోమంది, ఎన్నో సంస్థలు కొమెర జాజిని సన్మానాలు, సత్కారాలతో అభినందిస్తూ, కార్యోన్ముఖుడికి నీరాజనాలు పలుకుతున్నారు.

'పల్లెసృజన' స్ఫూర్తిని ఇచ్చిందన్న జాజికి మా కృతజ్ఞతలు. కంకణం కట్టుకొని, పిల్లలకు ప్రకృతిని కనెక్ట్ చేస్తూ, స్వచ్ఛందంగా, పూర్తి సమర్పణతో సమాజ సేవను అలుపు లేకుండా చేస్తున్న జాజి గారికి మా అభినందనలు, శుభాకాంక్షలు. ఆయన తన ప్రకృతి ప్రయాణంలో ఎంచుకున్న మైలు రాళ్ళు త్వరలో సాధిస్తారని, పిల్లలను ప్రకృతివైపుకు మళ్ళిస్తారని మనసారా ఆశిస్తున్నాము. ●

**కొమెర జాజి చిరునామా:**

**కొమెర జాజి (రాములు).**

**ఇంటి నెం. 7/52, వినుకొండ రోడ్, కారంపూడి గ్రామం,**

**గుంటూరు జిల్లా. – 522 614. ఫోన్ : 99084 11700**







# తెలుగు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయంతో ప్రభుత్వ ప్రోత్సాహం

- వీరరాఘవ రెడ్డి

గత 16 సంవత్సరాలుగా 'పల్లెసృజన' పునాది స్థాయి ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు చేస్తున్న కృషి పాఠకులకు విదితమే. ఈ ప్రయత్నాల్లో ఆర్థిక స్థోమత లేని, సమాజానికి అవసరమైన ఇన్నోవేషన్లను రూపొందిస్తున్న ఇన్నోవేటర్లకు ఇప్పటి దాకా శాయశక్తులా ప్రయత్నించి కొందరికి గ్రాంట్లు, మరి కొందరికి ఋణాలు లభించేందుకు కృషి చేసింది. దాదాపు కోటిన్నర రూపాయలు తెలుగు ఇన్నోవేటర్లకు అందేలా చేయగలిగింది. అలా ఆర్థిక సహకారం పొందిన ఇన్నోవేటర్లు తమ ఉత్పత్తులను తమ గ్రామాల్లోనే తయారు చేసి, సమాజానికి అందించడమే కాక, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ కొరత తీర్చేందుకు కూడా కృషి చేస్తున్నారు.

ఈ పరంపరలో 'పల్లెసృజన' సమాజ శ్రేయస్సుకై చేస్తున్న కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించి, ఈ సంవత్సరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 5 మంది ఇన్నోవేటర్ల ఇన్నోవేషన్లు వెలుగులోకి తెచ్చేందుకు, దాదాపు 25 లక్షల రూపాయల గ్రాంటును అందించాయి. ఈ గ్రాంటుతో ఇన్నోవేటర్లు సంతోషంగా తమ ఉత్పత్తులను తయారు చేయటం ప్రారంభించారు. ఇన్నోవేటర్లకు అందిన గ్రాంటు, వారి పరికరాలను గురించి తెలుసుకుందాం.

**షణ్ముఖరావు (9492113609), మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ:**

'మోనో వీడర్ మ్యాన్ డ్రైవ్' యంత్రాన్ని తయారు చేసే ఆలోచన అందించినందుకు 'నిధి ప్రయాస్' పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం షణ్ముఖరావుకు 10 లక్షల రూపాయల గ్రాంటును ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన అడ్వాన్స్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి, ఒకటి రెండు రోజుల్లోనే ఈ డబ్బు షణ్ముఖరావు చేతికి అందుకుంది. ఐఐటి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగుతోంది.






ఈ వీడర్ కేవలం ఒక చక్రం కలిగి వుంటుంది. రైతు దీనిపైనే కూర్చుని తనకు అవసరమైన సేద్యం పనులను చేసుకోవచ్చు. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణంగా మనిషి నడుస్తూ పని చేసే వీడర్లను కూడా ప్రస్తుతం యువకులు ఉత్సాహం చూపటం లేదు. అందువల్ల యంత్రం పైనే కూర్చుని ట్రాక్టరులా నడపటం వల్ల రైతులు ఎలాంటి అలుపు లేకుండా తమ వ్యవసాయ పనులు చేసుకుంటారని ఆలోచించి రూపొందించిన మోనో వీడర్ ఇది. ఒకే చక్రం కలిగి వుండి, మనిషి దానిపైననే కూర్చుని పొలంలో సేద్యాలు చెయ్యటంతో పాటు, పంట పొలాల్లో అంతర సేద్యాలు, పురుగు మందు పిచికారి లాంటి పనులను కూడా ఒకే వ్యక్తి సులభంగా చేసుకోవచ్చు. ఈ మోనో వీడర్ అతి త్వరలోనే రైతాంగానికి అందుబాటులోకి వస్తుంది. ఇకపై పురుషులే కాదు, మహిళా రైతులు కూడా తమ పొలం పనులను సునాయాసంగా చేసుకోవచ్చు.

**సద్దా కిషన్ కుమార్ (9490286261), జగిత్యాల, తెలంగాణ :**

ఈ ఇన్నోవేటర్ రూపొందించిన పరికరం 'ఇన్‌స్టెంట్ ప్యాడీ డ్రయ్యర్' (త్వరగా వరి ధాన్యాన్ని ఆరబెట్టే పరికరం). పొలం నుండి వరి ధాన్యాన్ని సేకరించిన తర్వాత దాన్ని ఆరబెట్టడం తప్పనిసరి. ఇలా ఆరబెట్టే సమయంలో కూడా వర్షాలు వచ్చి చేతికి వచ్చిన ధాన్యం మొత్తం తడిచిపోయి లబోదిబో మంటున్న రైతుల గోడు మనం చూస్తూనే ఉన్నాం. ఈ సమస్యకు పరిష్కారంగా ధాన్యాన్ని అతి త్వరగా, ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఆరబెట్టేందుకు రూపొందించిన పరికరం ఇది. ఈ యంత్రం తయారైతే రైతాంగానికి కొన్ని కోట్ల రూపాయలు ఆదా చేసినట్లే. అంతే కాకుండా వారి శ్రమను చాలావరకు తగ్గిస్తుంది.

ఈ యంత్రం రూపకల్పన ఆలోచనను ఎన్నుకున్న 'ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం' అధికారులు ఈ నమూనా యంత్రం తయారు చేసేందుకు రూ. 4.5 లక్షల గ్రాంటును ఇచ్చేందుకు అంగీకరించి, మొదటి విడతగా రూ. 2.7 లక్షలు అందజేయటం జరిగింది. ఈ నమూనా యంత్రం చేయటం పూర్తయింది. దీని పనితనాన్ని కూడా అధికారులు అంగీకరించటం జరిగింది. మిగతా సొమ్మును కూడా త్వరలో విడుదల చేస్తారు. ప్రస్తుతం ఈ యంత్రం రైతుకు అవసరమైన సైజులో రూపొందించే కార్యక్రమాలు జరుగుతూ ఉన్నాయి. త్వరలో ఈ యంత్రం రైతాంగానికి అందుబాటులోకి వస్తుంది.






**హనుమాయప్ప (9441982806), కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్ :**

ఈ ఇన్నోవేటర్ రూపొందించిన పరికరం వేరుశనగ పంట పూర్తయిన తర్వాత ఆ పంటను పొలం నుండి పీకి, రైతుకు అవసరమైన మేర కుప్పలుగా చేసుకుంటూ వెళ్ళే ట్రాక్టరు అనుసంధాన పరికరం. రైతు కూలీల లభ్యత కరువు, అధిక ఖర్చు మూలంగా విస్తారంగా వేరుశనగ పండించే రైతులు ఆ పంట పండించడం గణనీయంగా తగ్గిపోయింది. ఈ సమస్యను అర్థం చేసుకున్న హనుమాయప్ప అనే రైతు ఇన్నోవేటర్ వేరుశనగ పంటను త్వరగా పొలం నుండి పీకి, కుప్పలు కుప్పలుగా వేసే పరికరాన్ని రూపొందించాడు.

ఈ పరికరం ఆలోచన మెచ్చిన 'ఐసిఎఆర్, ఆర్‌కెవివై, రాఫ్తార్' అధికారులు దీన్ని రూపొందించేందుకు రూ. 3 లక్షల గ్రాంటును మంజూరు చేయగా, ముందస్తుగా రూ. 1.8 లక్షలు ఇవ్వటం జరిగింది. ఇన్నోవేటర్ ఈ పరికరాన్ని తయారు చేసి, పొలంలో విజయవంతంగా ప్రదర్శించడం కూడా జరిగింది. అధికారులు కూడా ఈ పరికరం వల్ల వేరుశనగ రైతులకు పెట్టుబడి ఖర్చు చాలావరకు తగ్గుతుంది అని కితాబునివ్వటం జరిగింది. వచ్చే పంట సీజన్ లోగా ఈ పరికరాలు రైతాంగానికి విరివిగా అందుబాటులో ఉంటాయి. దీనితో పాటు పొలం నుండి వేరుశనగ పైరును పీకిన తర్వాత, వేరుశనగ కాయలను కూడా తెంపేందుకు ఒక చిన్న యంత్రం రూపకల్పన కూడా చేసి వచ్చే సీజన్ నాటికి రైతాంగానికి అందుబాటులోకి తెస్తానని అంటున్నారు ఇన్నోవేటర్ హనుమాయప్ప. ఈ యంత్రాల రాకతో తెలుగు రాష్ట్రాల్లో వేరుశనగ పంట మళ్ళీ పూర్వపు వైభవాన్ని సంతరించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రైతు పెట్టుబడి ఖర్చు తగ్గటం వల్ల పంట పండించే వారి సంఖ్య అధికమై, సమాజానికి వేరుశనగ నూనె ధర కూడా అందుబాటు ధరలో లభిస్తుందని ఆశిద్దాం.




**గురుమూర్తి శెట్టి (9849126223), చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ :**

గురుమూర్తి శెట్టి అనే రైతు ఇన్నోవేటర్ ఎన్నో సంవత్సరాలుగా పట్టు పురుగుల పెంపకం ఖర్చులు తగ్గించేందుకు ఎన్నో రకాల సృజనాత్మక ఆలోచనలను రైతాంగానికి అందిస్తూ వస్తున్నారు. ఈ పంటలో పట్టు పురుగుల నుండి తయారైన దారపు కండలను సేకరించే పని చాలా ఖర్చుతో కూడుకున్నది. ఈ ఖర్చును గణనీయంగా తగ్గించేందుకు గురుమూర్తి ఒక చిన్న యంత్రాన్ని రూపొందించాడు. ఈ యంత్రం ద్వారా ప్రతి రైతు పట్టుదారపు కండలను సేకరించే పనిలో 60 నుండి




80 శాతం ఖర్చును ఆదా చేసుకోవచ్చు. ప్రతి రైతు కొనుగోలు చేయగలిగే ధరలోనే ఇది లభిస్తుంది.

ఈ ఆలోచనను ఎన్నుకున్న 'ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, తిరుపతి' వారు "రాఫ్తార్" కార్యక్రమం క్రింది గ్రామీణ ఇన్నోవేషన్లను వెలుగులోకి తెచ్చే కార్యక్రమంలో ఇతనికి రూ. 3 లక్షలు మంజూరు చేసి, ముందస్తుగా 60 శాతం అంటే రూ. 1.8 లక్షలు విడుదల చేశారు. యంత్రం రూపకల్పన పూర్తయి విజయవంతంగా పని చేసింది. అధికారులు కూడా ఈ యంత్రం వల్ల పట్టుపురుగుల పెంపకం కూడా తక్కువ ఖర్చుతో గణనీయంగా పెరిగే అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. ప్రస్తుతం ఈ యంత్రం రైతాంగానికి అందుబాటులో ఉంది.

**బాబురావు (9440940025)ఫోన్:, పార్వతీపురం, ఆంధ్రప్రదేశ్ :**

సాళ్ళు తీయటం, విత్తనం వేయటం, భూమిలో పడ్డ విత్తనాన్ని మట్టితో కప్పివేయటం, ఎరువులు, పురుగు మందులు చల్లటం ఈ పనులన్నీ ఒకే యంత్రం చేసేలా తయారు చేసిన బాబూరావు 'మల్టీపర్పస్ డ్రమ్ సీడర్' గురించి పాఠకులకు విదితమే. దీన్ని ఇద్దరు మనుషులు లాగితే సునాయాసంగా జూక రోజులో ఒక హెక్టారులో విత్తవచ్చు. ఈ పరికరాన్ని ఇంకా అభివృద్ధి చేసేందుకు బాబూరావుకు తిరుపతి వ్యవసాయ విశ్వ విద్యాలయం, 'ర్యార్స్' ద్వారా రూ. 4 లక్షల గ్రాంటును మంజూరు చేసి, అందులో 60% రూ. 2.4 లక్షలు విడుదల చేశారు.

పరికరం అభివృద్ధి చేయడం జరిగింది. అధికారులు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. మిగతా సొమ్ము మంజూరు చేసి, ఈ పరికరం రైతులకు అందుబాటు ధరలో తయారీ చేసేందుకు కూడా తగిన ఆర్థిక సహాయం చేస్తామని తెలియజేశారు. వచ్చే విత్తనాల సీజన్ నాటికి ఈ మల్టీపర్పస్ డ్రమ్‌సీడర్ రైతులోకినికి అందుబాటులోకి వస్తుంది. ●






# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- జమ్మలమడక శశిమోహన్

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

– ఎడిటర్.

## గ్రామ స్థాయిలో మిల్లర్లు

గ్రామాలు స్వయం సమృద్ధి పొందాలి అని పూర్వం నుండి ఎందరో మహానుభావులు చెపుతూనే ఉన్నారు, నాయకులు, ఎన్నో సంస్థలు నేడు కూడా అదే నినాదంతో ఎన్నెన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నారు. ఇంతవరకు ఈ గ్రామీణ స్వయం సమృద్ధి అనేది కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయేమో అనిపిస్తోంది.

గ్రామం లోకి బయటి నుండి దిగుబడులు తగ్గించి, ఎగుమతులను పెంచేలా చేసి, గ్రామంలోని అన్ని రకాల పదార్థాలు గ్రామానికే చెందేలా (డబ్బుతో సహా) చేసేదే గ్రామీణ స్వయం సమృద్ధి. ఉదాహరణకు : దాదాపు ప్రతి గ్రామంలో వరి ధాన్యం పండుతోంది. కానీ అధిక శాతం మంది రైతులు ఆ ధాన్యాన్ని మార్కెట్‌లో అమ్మి, వారికి అవసరమైన బియ్యాన్ని షాపుల్లో కొనుగోలు చేసి ఇంటికి తెస్తారు. దీనివల్ల ఆ రైతుతో పాటు, గ్రామానికి, గ్రామంలోని పశువులకు కూడా నష్టమే జరుగుతోంది. అంటే ఇదే వడ్లను గ్రామంలోనే మిల్లు ఆడించి, బియ్యం చేసి, ఆ బియ్యాన్ని గ్రామంలోని అవసరమైన వారందరికీ సరఫరా చేసి, మిగిలిన బియ్యాన్ని టోకు దుకాణాల వారికి విక్రయించాలి. ఇలి చేయటం వల్ల గ్రామీణులకు ఎటువంటి కల్తీ లేని బియ్యం దొరుకుతుంది, పశువులకు దాణ (తవుడు/ వరి పొట్టు) లభిస్తుంది, గ్రామం నుండి బయటకు వెళ్ళే డబ్బు, గ్రామంలోనే వినియోగింప బడుతుంది. అనవసరపు (మార్కెట్‌కు వెళ్ళటం, మార్కెట్



నుండి రావటం) రవాణా ఖర్చులు మిగిలి పోతాయి. ఇంకా కొద్దిగా కష్ట పడగలిగితే ఆ ఊరినుండి ఉపాధి కోసం బయటకు వెళ్ళిన వారిని కూడా సంప్రదించి, మన గ్రామస్తులు మన గ్రామంలో పండించిన బియ్యాన్నే తినాలి అనే స్ఫూర్తి కలిగించ గలిగితే ఇంకా మంచిది. ఇలా ఇవన్నీ లెక్కలు వేస్తే ఒక్కో గ్రామానికి కనీసం కోటి రూపాయల దాకా ఆదా అవుతుంది. ఆ డబ్బు గ్రామానికే ఉపయోగ పడి గ్రామం అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల గ్రామంలోని యువతకు కూడా ఉపాధి లభిస్తుంది. గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.



ప్రతి వ్యవసాయ పదార్థాలకు విలువను జోడించి అమ్మ గలిగితే ప్రతి పల్లె నందన వనమే అవుతుంది. ఇందుకు అవసరమైన యంత్రాలను మన పల్లెసృజన ఇన్నోవేటర్లు ఇప్పటికే తయారు చేసి, మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అందులో వినయభూషణ్ రెడ్డి అనే ఇన్నోవేటర్ కొర్రలు, బియ్యం, గోధుమలు అన్నీ మర ఆడించేలా ఒక మినీ రైస్ మిల్లును తయారు చేసి విజయవంతంగా విక్రయిస్తున్నాడు. దీని ఖరీదు కూడా గ్రామ అవసరాన్ని బట్టి కేవలం 3 నుండి 5 లక్షల లోపే ఉంటుంది.

ఇలాగే కుంచర్ల శ్రీనివాసరావు అనే ఇన్నోవేటర్ కూడా ఒక అద్భుతమైన మొబైల్ రైస్ మిల్లు తయారు చేశాడు. ఈ మిల్లులో పెద్ద రైస్ మిల్లులో వచ్చిన నాణ్యమైన బియ్యం ఆ రైతు వద్దకే మీరు నేరుగా వెళ్ళి అతని ఇంటివద్దనే బియ్యం పట్టించి ఇవ్వవచ్చు. ఇలా చేయటం వల్ల రైతు తన వడ్లను మిల్లు వరకు కూడా తీసుకు రావాల్సిన అవసరం లేకుండా తన ఇంటివద్దనే బియ్యం తయారు అవుతుంది. తవుడు కూడా తన పశువులకు ఉపయోగ పడుతుంది. యువతకు అద్భుతమైన ఉపాధి లభిస్తుంది. దీని ఖరీదు కేవలం ఒకటిన్నర నుండి రెండు లక్షల లోపే ఉంటుంది. ఇది మొబైల్ రైస్ మిల్లు కాబట్టి మీ గ్రామంలోనే కాదు, చుట్టు పట్ల గ్రామాలకు కూడా వెళ్ళి వడ్లను మర ఆడించి, ఎవరి బియ్యం వాళ్ళే తయారు చేసుకునేలా చేయటం వల్ల మీ ఉపాధితో పాటు, రైతుకు కూడా ఎంతో ఆదాయాన్ని సమకూర్చిన వాళ్ళవుతారు.

ఇలా ప్రతి గ్రామానికి ఒక మినీ రైస్ మిల్లు, ఒక దాల్ మిల్లు, ఆయిల్ మిల్లులను ఏర్పాటు చేసుకోవాలి. అలా చేస్తే గ్రామ ప్రజలు మొత్తం తమ గ్రామంలోనే పండించిన ఆహార పదార్థాలను (నూనెతో సహా) తింటున్నామన్న తృప్తితో పాటు, బయటి నుంచి దిగుమతి తగ్గి, గ్రామం నుండి ఎగుమతులు పెరుగుతాయి. ఈవిధంగా చేస్తే గ్రామం స్వయం సమృద్ధి అతి కొద్ది సంవత్సరాల్లోనే పొందుతుంది.

ఈ పనులన్నీ చేయటానికి గ్రామీణ యువత నడుం బిగించాలి. ప్రస్తుతం ప్రభుత్వాలు కూడా ఇటువంటి కొత్త రకం ఆలోచనలను సరైన పద్ధతితో చూపించ గలిగితే ఏర్పాటు చేయటంలో చాలా వరకు ముందుకు వస్తాయి. గ్రామంలో నుండి ఎవ్వరూ బ్రతుకు తెరువు కోసం వలస వెళ్ళాల్సిన అవసరం లేకుండా, స్వగ్రామం లోనే ఉపాధి లభిస్తుంది. నిరుత్సాహ పరిచే వారి మాటలను పట్టించుకోకుండా, లక్ష్యంవైపు అడుగులు వేసి ఇది అసాధ్యమయ్యే పని నిరూపించి మీ గ్రామాన్ని విజయపథం వైపుకు నడవండి. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనలు, యంత్రాల పట్ల అవగాహన కల్పించేందుకు 'పల్లెసృజన' ఎల్లప్పుడూ మీవెంటే ఉంటుంది. విజయోస్తు. ●

**వివరాల కొరకు సంప్రదించండి : సుభాష్, ఫోన్ : 9652801700**


## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



**హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.**

**ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.**

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

**67, రోడ్ నెం. 2, వాయుపురి,**
**సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.**
**ఫోన్ : 040-27111959,**
**సెల్ : 96528 01700.**

# మార్చి - ఏప్రిల్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు




26 మార్చి, 2022 నాడు సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో
కళాశాల వైస్ ఛాన్సలర్ గారి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న
'పల్లెసృజన' ప్రతినిధి సుభాష్ చందర్.














నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ డైరెక్టర్ డా. విపిన్ కుమార్ గారు
మార్చి 27న 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించినప్పటి చిత్రాలు

హెచ్ఎం టివి వారు 'పల్లెసృజన' కార్యాలయానికి విచ్చేసినపుడు
మన కార్యక్రమాలను గురించి మీడియా వారికి వివరిస్తున్న
'క్రియేటివ్ మైండ్స్' ప్రతినిధి సుభాష్ చందర్

బాల వికాస్ ఇంటర్‌నేషనల్ సెంటర్ (బివిఐసి), హైదరాబాద్ లో
8 ఏప్రిల్, 2022న జరిగిన ఒక్కరోజు ప్రదర్శనలో
16 మంది ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించారు

మార్చి నెలలో 'పల్లెసృజన' కార్యాలయంలో రెండుసార్లు జరిగిన
వ్యవసాయదారుల సమ్మేళనంలో పాల్గొన్న రైతులు ఇన్నోవేషన్లను
నిశితంగా పరిశీలించారు.



జాతీయ అవార్డు పొందిన
# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

### పెద్ద చెట్లను ప్రూనింగ్ చేసే యంత్రం :

**సమస్య - పరిష్కారం :**

పండ్ల తోటలలో సాధారణంగా చెట్ల కొమ్మలను ప్రూనింగ్ చేయటం ద్వారా చెట్లు నియంత్రణ లేకుండా ఎత్తుకు పెరగకుండా, చెట్టు దట్టంగా వచ్చి కాపు ఎక్కువగా వచ్చి, ఫలాలు సులభంగా తెంచుకునే వుండటానికి అనువుగా వుంటుంది. సాధారణంగా ఈ పని గొడ్డలి, చాకు, రంపాలతో చేస్తూ వుంటారు. ఈవిధానం కష్టతరమైంది, ఎక్కువ కూలీలు అవసరమౌతారు, పైగా ప్రమాదంతో కూడుకున్నది. వీటితో సరియైన రూపం రాకపోవటమే కాక, ఎక్కువ సమయం కూడా తీసుకుంటుంది. చాలా ఎత్తున్న కొమ్మలను ప్రూనింగ్ చేయటానికి ప్రత్యేకమైన నిచ్చెనల సహాయం తీసుకోవాల్సి వుంటుంది. వీటన్నిటికి పరిష్కారంగా రాజస్థాన్‌కు చెందిన గుర్‌మేల్ సింగ్ ధోన్సీ అనే రైతు ఒక ఆటోమేటిక్ ఎలక్ట్రో మెకానికల్ ప్రూనింగ్ యంత్రాన్ని తయారు చేశాడు.

**పరికరం :**

ట్రాక్టరుకు అనుసంధానం చేసే ఈ పరికరం ఎంత పెద్ద చెట్టునైనా ప్రూనింగ్ చేయటానికి ఉపయోగ పడటమే కాక, ఎత్తయిన కొమ్మలను కూడా కత్తిరించ గలదు. హైడ్రాలిక్ సిస్టం వుండటం ద్వారా పైకి క్రిందకి వెళ్ళటం సులభమౌతుంది.

**సాంకేతిక వివరాలు :**

- కనీసం 40 హార్స్‌పవర్‌ల సామర్థ్యం గల ట్రాక్టరుకు అనుసంధానం చేసే పరికరం.
- హైడ్రాలిక్ సదుపాయం కలదు.
- 15 కిలోవాట్ల హైడ్రాలిక్ మోటారుతో పని చేస్తుంది.
- మోటారు స్పీడు 1000 ఆర్‌పియం.
- ఇంటర్మీడియట్ షాఫ్ట్, 2000 ఆర్‌పియం.
- సెంట్రల్ షాఫ్ట్ 3000 ఆర్‌పియం.
- బ్లేడ్లు 4,200 ఆర్‌పిఎం.







ముఖ్యాంశాలు :

- 20 అడుగుల ఎత్తయిన చెట్టను కూడా ప్రూనింగ్ చేయగలదు.
- 20 అడుగుల వెడల్పున్న రోడ్డుకు ఇరువైపుల వున్న చెట్లను ఒకేసారి ప్రూనింగ్ చేసుకోవచ్చు.
- పండ్ల తోటల్లో 200 చెట్లను కేవలం ఒక గంటలో పూర్తి చేయవచ్చు.
- ట్రాక్టరు కదలకుండా వుండి చుట్టూ 10 అడుగుల వ్యాసంలో తిరుగుతూ చెట్లను ప్రూనింగ్ చేసుకోవచ్చు.

పురస్కారాలు :

- 2012లో జరిగిన ఎన్ఐఎఫ్ వారి 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందారు గుర్మెల్‌సింగ్ ధోన్సీ.

### పొలాన్ని చదును చేసి అదనపు మట్టిని టిప్పర్‌లో నింపే యంత్రం :

సమస్య – పరిష్కారం :

చదునుగా లేని వ్యవసాయ భూములలో పంట వేయటం కష్టం. సాధారణంగా వర్షాలకు భూమి కోసుకు పోవటం ద్వారా పొలాల్లో ఎత్తు పల్లాలు ఏర్పడుతాయి. అటువంటి సందర్భాలలో ఎక్కువైన, ఎత్తుగా వున్న మట్టిని త్రవ్వి తీసి, పొలంలో తగ్గ వున్నచోట కానీ లేదా బయట వేయాల్సి వుంటుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. దీనికి చాలామంది కూలీలు, చాలా సమయం పడుతుంది. ఈ సమస్యకి పరిష్కారంగా పంజాబ్‌కు చెందిన 'కుల్దీప్ సింగ్ మరియు రేషమ్ సింగ్'లు వేరువేరుగా భూమిని త్రవ్వి టిప్పర్లోకి నేరుగా ఎత్తి పోసే యంత్రాలను రూపొందించారు. ఈ



యంత్రాలతో పొలాలను చదును చేయటమే కాక, ఎక్కువగా వున్న మట్టిని టిప్పర్‌లోకి ఎత్తి తక్కువగా వున్నచోట వేయటం కాని, లేదా బయటకు తీసుకువెళ్ళి పడవేయటం కాని సులభంగా చేసుకోవచ్చు. రైతులకు ఎంతో సమయం, ఖర్చు ఆదా అవుతుంది.

పరికరం :

ఈ మట్టిని త్రవ్వి టిప్పర్‌లో నింపే పరికరం ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది. ఇది భూమిని త్రవ్వి కన్వేయర్ బెల్టు ద్వారా నేరుగా టిప్పర్‌లోకి పంపుతుంది. ఇందులో త్రవ్వే విభాగం కాకుండా రెండు కన్వేయర్ బెల్టులు వుంటాయి. మొదటిది మట్టిని పైకి ఎత్తటానికి, ఎత్తిన మట్టిని టిప్పర్‌లోకి వేసేది రెండోది. ఇది ఒకసారి 4 అంగుళాల లోతువరకు భూమిని త్రవ్వగలదు.

సాంకేతిక వివరాలు :

- రెండు నిమిషాలలో 11-6-2.25 అడుగుల సైజు టిప్పర్‌ను మట్టితో నింపగలదు.
- 50 హార్స్‌పవర్ శక్తిగల ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది.
- గంటకి 5 నుండి 6 లీటర్ల డీజిలు ఖర్చవుతుంది.
- ఒకేసారి 4 అడుగుల వెడల్పులో, 4 అంగుళాల లోతు భూమిని త్రవ్వి తీసి 8.5 అడుగుల ఎత్తు నుండి టిప్పర్‌లోకి పడేయ గలదు.

ముఖ్యాంశాలు :

- కాలువలు త్రవ్వటానికి, రోడ్లు వేయటానికి, ఇళ్ళు కట్టడానికి ఎంతో అనువైన యంత్రం.
- సరాసరిన రోజుకి 150 టిప్పర్ల మట్టిని త్రవ్వి తీయగలదు.






**పురస్కారాలు :**

- 2013లో జరిగిన ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతిని ఇన్నోవేటర్లు సంయుక్తంగా పొందారు.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

# 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు విజ్ఞప్తి

'పల్లెసృజన' పత్రిక అప్రతిహతంగా 16 సంవత్సరాలుగా కుంటుపడకుండా మీ ముందుకు వస్తున్న విషయం మీకందరికీ విదితమే. స్వచ్ఛందంగా వాలంటరీ వ్యవస్థ మీద ఆధారపడి, ఎటువంటి వ్యాపార ప్రకటనలు, డొనేషన్‌లు లేకుండా ఇప్పటి వరకు ఈ పత్రికను తద్వారా నూతన ఇన్నోవేషన్లను, ఇన్నోవేటర్లను మీకు పరిచయం చేస్తూ వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు వస్తున్న విషయం కూడా మీకు తెలుసు.

కోవిడ్ మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన అలజడి లో కూడా నిరాఘాటంగా పత్రిక నడిపే ప్రయత్నంలో సఫలీకృతులం అయ్యాము. కానీ, రోజురోజుకూ పెరిగి పోతున్న పేపర్ ధరలు, ముద్రణా ఖర్చులను తట్టుకోవటం కొద్దిగా కష్టంగా మారుతోంది. కావున దయచేసి ఇన్నోవేటర్లు ఒక విషయం గమనించాలి. ఇప్పటి నుంచి మీకు చేరుతున్న పత్రిక ఉచితంగా పంపడం కొంత భారంగా అనిపిస్తోంది. కావున మీ పత్రికకు మీరు కూడా చందాదారులు కావలసిందిగా కోరుతున్నాము.

మీరు పత్రికకు అందిస్తున్న సహకారం మమ్మల్ని ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేస్తూ ఆనందంగా ముందుకు సాగేలా చేస్తోంది. కావున మీకు తెలిసిన వారికి, మీ మిత్రులకు ఈ పత్రికను గురించి తెలియజేసి, కొత్త చందా దారులను చేరేలా మీవంతు ప్రయత్నం చేయ గలరు. వీలైనంత వరకు పత్రిక ధర పెంచకుండా, చందా దారులను అధికం చేసినట్లయితే ముద్రణా ఖర్చు కొంత వరకు తగ్గుతుందని భావిస్తున్నాము. 'పల్లె సృజన' ప్రతి పల్లెకు చేరాలన్నదే మా ఆకాంక్ష. శుభ కార్యాలలో ఈ పత్రిక చందానే మీరిచ్చే బహుమతిగా చేసుకుని పత్రిక ఎక్కువ మందికి చేరేలా సహకరిస్తారని ఆశిస్తున్నాము.

– ఎడిటర్.

# పల్లెసృజన

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

'పల్లెసృజన' ఒక స్వచ్ఛంద సంస్థ. దీని నిర్వాహకులు, వాలంటీర్లు అంతా స్వచ్ఛందంగా పనిచే స్తారు. గ్రామాల్లోవున్న సృజనాత్మకతను వెతికి, సమాజానికి తెలియపరచడం, సృజనాత్మకత గల వ్యక్తులను (ఇన్నోవేటర్స్‌ను) గౌరవించి వారిని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ప్రధాన లక్ష్యంతో 2005లో 'పల్లెసృజన' స్థాపించబడింది. చదువుకోని గ్రామ ప్రజల్లో కూడా శాస్త్రవేత్తలు ఉన్నారని త్రికరణశుద్ధిగా నమ్ముతుంది 'పల్లెసృజన'. అలాంటి జ్ఞానవేత్తల జ్ఞానాన్ని గుర్తించి, గ్రంథీకరించి, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించటంతో పాటు ఆ జ్ఞానకర్తను సమాజం గుర్తించేలా చేయుటం 'పల్లెసృజన' ప్రధాన కార్యక్రమం. జ్ఞానశోధనకై 'పల్లెసృజన' ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి 3 రోజుల పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాల గుండా కేవలం ప్రకృతిని ఆస్వాదిస్తూ, జ్ఞానాన్ని వెతుక్కుంటూ సాగుతుంది 'చిన్నశోధయాత్ర'.

అలాంటి 'చిన్న శోధయాత్రలు' ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వున్న 'పల్లెసృజన' అభిమానులు, వాలంటీర్ల సహకారంతో సేకరించిన 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'ను "పల్లెసృజన" పత్రిక ద్వారా వెలుగులోకి తీసుకు రావటంతో పాటు జాతీయ స్థాయిలో "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్", "హనీబీ నెట్‌వర్క్" లాంటి సంస్థలతో మమేకమై సేకరించిన జ్ఞానాన్ని గ్రంథస్థం చేస్తుంది. అలా వారి జ్ఞానానికి గుర్తింపు తీసుకు వచ్చే ప్రయత్నంలో ప్రారంభం నుంచి నేటి వరకు ముగ్గురు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్‌కు "పద్మశ్రీ" పురస్కారాలు, 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (ఎన్.ఐ.ఎఫ్.) ద్వారా 14 మంది గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్‌కు 'రాష్ట్రపతి పురస్కారం', నలుగురు ఇన్నోవేటర్లకు అంతర్జాతీయ పురస్కారాలతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు ఎందరో ఇన్నోవేటర్లకు అందించటం ద్వారా వారికి సమాజంలో సమున్నత స్థానాన్ని కల్పించగలిగింది.

ఇలా తయారైన ఇన్నోవేషన్లను "క్రియేటివ్ మైండ్స్" అను బంధ సంస్థ సహకారం తో వాటిని ప్రజలకు చేరవేసేలా చర్యలు చేపట్టింది "పల్లెసృజన".

దేశీయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, దేశీయ జ్ఞానంతోనే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుంది అని నిరూపించాలన్నదే "పల్లెసృజన" సంకల్పం.

**అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు....**

| | | |
|---|---|---|
| ❀ సీడర్లు (6), | ❀ నీరు తోడే మినీ పంపులు (4), | ❀ కరెంటు స్తంభాలను ఎక్కే పరికరాలు (3), |
| ❀ వీడర్లు (14), | ❀ ట్రాక్టర్ లిఫ్టర్లు & లెవెలర్లు (3), | ❀ వృద్ధులు, పేషెంట్ల కొరకు సకల సౌకర్యాల మంచము (3), |
| ❀ రొటోవేటర్లు (4), | ❀ మినీ ట్రాక్టర్లు (5), | ❀ ఎలక్ట్రిక్ & ఎలక్ట్రానిక్ పరికరాలు (12), |
| ❀ స్ప్రేయర్లు (16), | ❀ మినీ రైస్ మిల్లు (2), | ❀ ఇంటి అవసరాల కోసం హెర్బల్ ద్రావకాలు, |
| ❀ హార్వెస్టర్లు (6), | ❀ ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాలు (10), | ❀ ఆవు పేడతో వస్తువులు చేసే పరికరాలు (14). |
| ❀ నూర్పిడి పరికరాలు (9), | ❀ ఇటుకల తయారీ యంత్రాలు (2), | ❀ 48 డిగ్రీల ఎండలో కూడా పండే 'HRMN - 99' ఆపిల్ మొక్కలు |
| ❀ చేతి పనిముట్లు (8), | ❀ గ్రామీణ రవాణా యంత్రాలు (8), | ❀ మూలికా / సేంద్రియ పురుగు మందులు |
| ❀ మాన్యువల్ వీడర్లు (5), | ❀ కొబ్బరి మరియు ఇతర చెట్లు ఎక్కే పరికరాలు (3), | |
| ❀ వ్యవసాయ పనిముట్లు, | | |

**పై ఇన్నోవేషన్లు కావలసిన వారు సంప్రదించ గలరు :**

**సుభాష్ చందర్,** సి.ఇ.ఓ., **"క్రియేటివ్ మైండ్స్"**

ఫ్లాట్ నెం. 77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.

ఫోన్ : 040–27111959, మొబైల్ : 9652801700.

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

**Loksarvani**
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

**27301**

**పశువులకు తగిలిన గాయాలు మాన్పడానికి :**

పొలలో పని దున్నేటప్పుడు, అడవులలో తిరిగేటప్పుడు ఇతరత్రా పశువులకు గాయాలు కావడం సర్వసాధారణం. సరియైన సమయంలో సరియైన చికిత్స చేయకపోతే అవి కురుపులుగా మారి ప్రమాద స్థాయికి చేరే అవకాశముంది. పశువుకి కూడా చాలా బాధగా వుంటుంది. దీనికి రకరకాల మందులు వాడినా తమిళనాడు తిరుచ్చి ప్రాంతానికి చెందిన 'పురై కొక్కలన్ వెలంకపట్టయ్' అనే రైతు ఒక సులభమైన చిట్కా వాడుతూ వుంటాడు.

పశువులకు గాయమైనపుడు అతను 'బొక్కెన ఆకు' గుప్పెడు తీసుకుని మెత్తగా నూరి ఆ ముద్దను గాయంపై వేసి కట్టు కట్టాలి. ఇలా రోజుకు ఒకసారి చొప్పున మూడు రోజుల పాటు చేస్తే గాయం నయమవుతుంది అంటారీయన.



**27304**

**పశువులలో కాలు వాపులు తగ్గటానికి :**

పశువులకు నడకలో కాలు బెణికినప్పుడు వాపు వచ్చే అవకాశముంటుంది. అప్పుడు పశువు నడవలేక బాధ పడుతుంటుంది. ఆ వాపు త్వరగా తగ్గటానికి తమిళనాడుకు చెందిన రైతులు ఒక చిట్కాను ఉపయోగిస్తుంటారు.

వారు 'సన్న జముడు' ఆకులను ఈనెలు లేకుండా తీసి, అందులో కొద్దిగా వాము కలిపి ముద్దగా నూరి ఆ మిశ్రమాన్ని 50 మి.లీ. వేపనూనె లో మరిగించి, చల్లారిన తర్వాత పశువుకు వాపున్న కాలికి కట్టుగా కడితే వాపు త్వరగా తగ్గుతుండటంతో ఈ పద్ధతిని విరివిగా ఉపయోగిస్తూ వుంటారు.



**27307**

**రసంపీల్చే పురుగులు, చీడల నివారణకు సేంద్రియ మందు :**

ఎక్కువగా కూరగాయల మొక్కలు మరియు ఇతర పంటలపై రసంపీల్చే పురుగు సోకిందంటే దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశముంటుంది. వీటికి సరియైన సమయంలో నియంత్రణ మార్గాలను ఉపయోగించడం ఎంతో అవసరం. గుజరాత్ రాష్ట్రానికి చెందిన చోటా ఉదేపూర్‌లోని 'రవిదాస్‌భాయ్ రాందాస్ భాయ్ రత్వా' అనే రైతు ఒక సేంద్రియ పద్ధతిలో తయారు చేసుకున్న మిశ్రమాన్ని వాడుతూ వుంటాడు. దీనికతను 5 కిలోల వేప ఆకులు, 2 కిలోల జిల్లేడు ఆకులు, మొగ్గలు, పూలను సేకరించి, వాటికి ఒక కిలో 'చెంగ నార', ఒక కిలో తక్కెల ఆకు, ఒక కిలో అడ్డసరం ఆకులు, ఒక కిలో మెంతుల



పొడిని కలిపి 25 లీటర్ల గోమూత్రంలో కలిపి 15 రోజుల పాటు గాలి చొరబడకుండా మూత బిగించిన డ్రమ్ములో వేసి మురగబెడతాడు. తర్వాత దీన్ని వడగట్టి, 15 రోజులు పాతబడిన పులిసిన మజ్జిగలో కలిపిన తర్వాత 14 లీటర్ల నీటిలో ఒకలీటరు ఈ మిశ్రమాన్ని కలిపి 6 రోజులకోసారి చొప్పున రెండు లేదా మూడుసార్లు పంటలపై పిచికారి చేస్తాడు. ఇలా చేయటం వల్ల రసంపీల్చే పురుగులు, ఇతర చీడల పీడ కూడా వదులుతుంది అంటారీయన.

27311

**పశువుల పేగులలో నులిపురుగుల నివారణ చికిత్స :**

పశువులలో ముఖ్యంగా దూడలలో నులిపురుగుల తాకిడి ఎక్కువగా వుంటుంది. ఇలాంటప్పుడు పశువులు, దూడలు ఎక్కువగా పారుకుంటూ వుంటాయి. ఈ నులిపురుగుల నివారణకు గుజరాత్‌కు చెందిన 'కమలాబా పున్సీస్ జాలా' అనే మహిళా రైతు ఒక చికిత్సను ఉపయోగిస్తూ వుంటుంది. ఆమె 200 గ్రా. గరిక గడ్డిని తీసుకుని మెత్తగా నూరి నీటితో కలిపి ఆ ద్రావకాన్ని రోజుకి రెండుసార్లు చొప్పున 3 రోజులపాటు పశువుకు తాపిస్తుంది. దీంతో నులిపురుగులు నివారించబడతాయి అంటుందామె.

దీనికే ఆమె మరో పద్ధతిని కూడా ఉపయోగిస్తూ వుంటుంది. 'తెల్ల దురదగొండి' కాయలను తీసుకుని మెత్తగా నూరి పులిసిన మజ్జిగలో కలిపి పశువు చేత తాగిపిస్తుంది. ఈ పద్ధతి కూడా సమర్థవంతంగా పని చేస్తుంది అంటుందీమె.



27309

**పత్తిలో గులాబి రంగు పురుగుల నివారణకు :**

ప్రత్తి పంటలో గులాబిరంగు పురుగు ఆశించినచో అవి కాయలలో తమ స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని వుంటాయి కనుక ఆ కాయ ప్రత్తి బాగా పగలదు, విత్తనాలను ఈ పురుగులు తినేస్తాయి కనుక పత్తి తూకం రాదు, నాణ్యత కూడా ఉండదు. దీని నివారణకు గుజరాత్‌కు చెందిన 'నాబ్జీభాయ్ దెత్రోజా' అనే రైతు సేంద్రియ పురుగు మందును కనుగొన్నాడు.

ఇతను దీని నివారణకు గోమూత్రము, వేప కాయలు, కుంకుడు కాయలను ఉపయోగిస్తాడు. ఈ మిశ్రమం తయారు చేయటానికి అతను 5 కిలోల ఎండిన వేప కాయలను పొడిగా చేసి, అందులో 500–700 గ్రా. కుంకుడు కాయల పొడిని కలిపి ఈ మిశ్రమానికి 10 లీటర్ల గో మూత్రంను జోడించి, ఆరు రోజుల పాటు మురగబెట్టిన తర్వాత దీన్ని వడగట్టి 250 మి.లీ. మిశ్రమాన్ని 15 లీటర్ల నీటిలో కలిపి ప్రత్తి పంటపై ఉదయం, సాయంత్రం పిచికారి చేస్తాడు. ఇదే మిశ్రమాన్ని బెండ పంటపై కూడా వాడి మంచి ఫలితాలను పొందాను అంటున్నాడు నాగ్జీభాయ్.

21101

**పశువుల్లో నులిపురుగుల నివారణకు :**

పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధపడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతున్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకొకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువుకు తాగిస్తే నులిపురుగుల నుండి నివారణ పొందవచ్చు అంటున్నాడు.






కాల, ప్రాంతాలకు అతీతంగా శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస మానవాళిని అంటిపెట్టుకునే వుంది. ప్రాచీన భారత దేశంలో విభిన్న రంగాలలో విశేష కృషి చేసిన మహనీయులు విజ్ఞానాన్ని బహు ముఖాలుగా విస్తరించే ప్రయత్నం చేసిన ఆలోచనాపరులు కోకొల్లలు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రుతుడు, భాస్కరుడు మొదలైన వారు ఖగోళము, గణితము, వైద్యము లాంటి శాస్త్రాలలో తమ పరిశోధనల ద్వారా కొన్ని మైలురాళ్ళను సృష్టించారు. ఆ కోవలోకి చెందిన వారే 'సురపాలుడు'.

వృక్ష శాస్త్రంలో నిగూఢమైన విషయాలను ఎన్నింటినో పరిశోధించి, అపురూపమైన వృక్ష వైద్య రహస్యాలను గ్రంథస్తం చేసినవాడు సురపాలుడు. మొక్కల లక్షణాలు కూడా మానవుల శరీరాన్ని పోలి వుంటుందన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినవాడు సురపాలుడు. వృక్ష శాస్త్రంలో విశేషమైన కృషి చేసిన ఈ మహనీయుడి గురించిన సమాచారం ఇటీవలి వరకు మన దృష్టికి రానేలేదు. ఆయన రచించిన "వృక్షాయుర్వేదం" అన్న గ్రంథం ఇంగ్లాండులోని ఒక గ్రంథాలయంలో ఇటీవలే బయట పడింది. ఆ పుస్తక ఆంగ్లానువాదం 'ఏసియన్ అగ్రో హిస్టరీ ఫౌండేషన్ (ఎఎహెచ్ఎఫ్), హైదరాబాద్ వారు 1996లో ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వృక్ష శాస్త్రం పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా పరిశోధకులకు, విద్యార్థులకు, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో 'ఐ-సర్వ్', హైదరాబాద్ వారు 2015 లో తెలుగు అనువాద ప్రక్రియకు ఉపక్రమించడం జరిగింది.

ఈ గ్రంథాన్ని 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సంకల్పంతో మే-జూన్, 2021 సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథంలోని మహత్తరమైన జ్ఞానాన్ని పాఠకులు అవగాహన చేసుకుని, ఆచరిస్తారని ఆశిస్తున్నాం. - ఎడిటర్.

### (గత సంచిక తరువాయి)

215. నువ్వులు, బార్లీ, "కులుత్థము" (ఉలవలు), పెసలు, మినుములతో చల్లటి మిశ్రమం తయారు చేసి చికిత్స చేసినచో అనుత్పాదక చెట్లు కూడా పూలు, పండ్లతో నిండిపోయిన కొమ్మలతో కళకళలాడతాయి.

216-218. .....

219. నీళ్ళు ఎక్కువై, మృదువయిన మొక్కలను గోళ్ళతో గీకి, వేళ్ళు బయటకు తీసి, తేనె మరియు విడంగాలను కలిపిన మిశ్రమాన్ని ఒక్కొక్క వేరుకు ప్రత్యేకంగా పూసి ఆ తర్వాత నీళ్ళు పట్టాలి.

220. ....

221. మృదువయిన మొక్కలు ఉన్నచోట ఎక్కువగా పొగ లేకుండా జాగ్రత్త పడాలి. తెలివయిన వారయితే ఈ మొక్కలకు ఎక్కువ లేపనాలు పెట్టరు.

222. పైన పేర్కొన్న వివిధ రకాలయిన ఔషధములకు లొంగని జబ్బులుగల మొక్కలను ప్రత్యేకమయిన స్థలమునకు మార్చి నారు నాటాలి.

**ఉద్యాన వన అద్భుతాలు:**

223-226. మొక్కలలో జరిగే వివిధ ప్రత్యేక ప్రక్రియలు ఈ క్రింద వర్ణింపబడినవి. అవి :

సంవత్సర కాలం పొడవునా పూలు, పండ్లు కాయుట; కాలముగాని కాలంలో కూడా పూలు, పండ్లు కాయుట; పరిమళం వెదజల్లుట; రుచులు మారుట; రంగులు మారుట; మారిపోయే పువ్వులు; మారిపోయే పండ్లు; సుగంధ భరితమయిన వాసనలు రకరకాలుగా మారుట; పరిమళం అరికట్టుట; లతలపై పువ్వులు పూచే ఏర్పాటు (బహుశా పుష్ప రహిత లతలపై కావచ్చు); చెట్లను పాకే తీగలుగా మార్చుట; వృక్షాలను మరుగుజ్జు చెట్లుగా మార్చుట; వివిధ రకాలయిన మొక్కలను మిళితం చేయుట; పరపక్వ దశ కాలాన్ని పొడిగించుట; పరిపక్వత లేని దశ; పంట దీర్ఘకాల మనగలుగుట; భంగం వాటిల్లుట మరియు వెంటనే కోలుకోవటం; తొందరగా ఫలదీకరణ చెందుట; చూడగానే పుష్పాలు, ఫలాలు పరిమాణంలో పెద్దగా కనిపించేట్లు చేయుట; వేరే జాతి మొక్కలుగా మార్చుట ఇంకా ఇతరములు.

227 - 229......

230-231. ఈ క్రింద వివరించిన విధంగా చేస్తే నిస్సందేహంగా ఋతువుగాని ఋతువులలో కూడా చెట్లు పూలు, పండ్లు ఇస్తాయి. వెన్నతో తయారు చేసిన నెయ్యిని ఒక కుండలో పోసి, దాంట్లో "వరాహి" "జీర" (జీలకర్ర విత్తనం), చెరుకు రసంతో ఒక నెలరోజుల పాటు ఉంచాలి. ఆ మిశ్రమం బాగా తయారయిన తర్వాత, చెట్టు పాదును బురదతో నింపి, మిశ్రమాన్ని చెట్టు వేళ్ళకు పూయాలి. అటు పిమ్మట చెరుకు రసాన్ని బాగా చిలుకరించి, "కుణపం", తేనెల మిశ్రమంతో పొగ చూరించాలి.

232. "నేరేడు", పగడము, "ఖూష్" మొక్కల వేళ్ళతో తయారు చేసిన

పిండిని పూసి, అదే పిండి కలిపిన నీళ్ళను చిలుకరించినచో సాధారణమయిన మామిడి చెట్టు కూడా ఉన్నత వర్గానికి చెందిన మామిడి చెట్టులాగా పంట ఇస్తుంది. తేనెటీగలను కూడా ఆకర్షించేటట్లు సువాసనలు వెదజల్లే పూత పూస్తుంది.

233. అశోక వృక్షాల లాంటి చెట్లకు పూసిన మొగ్గల సువాసన నిండిన మట్టిని వేళ్ళ దగ్గర నింపితే, చెట్లు చాలా ఆకర్షణీయమయిన గొప్ప పరిమళాన్ని వెదజల్లుతాయి.

234. ....

235. 'మధుక' పుష్పాలు (ఇప్ప పూలు), తామర పువ్వుల్లోంచి తీసిన తేనె, స్ఫటికం లాంటి చక్కెర మరియు "యష్టి"లను కలిపి ఒక బంతిలాగా తయారు చేయాలి. ఏదైనా చెట్టు వేళ్ళ దగ్గర ఒక రంధ్రం చేసి, ఆ రంధ్రంలో ఆ బంతిని ఉంచితే, ఆ చెట్టుమీదే చాలా కాలం మనగలిగే పండ్లు కాస్తాయి.

236. అశ్వఘ్నము, లాంగలి, బృహతి (వాకుడు) (చిన్నవి, పెద్దవి) వీటి మిశ్రమంతో ఒక బంతిని తయారు చేసి, ఆ బంతిని చెట్టు వేళ్ళ దగ్గర చేసిన ఒక రంధ్రంలో ఉంచాలి. ఆ తర్వాత అదే మిశ్రమం కలిపిన నీళ్ళను పడితే, సహజంగా పళ్ళు తియ్యవే అయినప్పటికి, ఆ చెట్టు పళ్ళు మాత్రం ఘాటుగా ఉంటాయి.

237. "విడంగము", "యష్టి", "యవలు", పాలు మిరయు బెల్లంల మిశ్రమంతో అంబలి తయారు చేసి, ఆ చిక్కటి అంబలిని చెట్టు వేళ్ళకు పూసినచో, మామూలుగా ఘాటైన పళ్ళు కాచే చెట్టు కూడా అమృతం లాంటి తియ్యటి పళ్ళు కాస్తుంది.

238. పుల్లటి పండ్లు కాస్తున్న చెట్ల వేళ్ళకు "మధుకము", "యష్టి", ద్రాక్షల పూదేనెలను స్ఫటిక వంటి వ,చదార బార్లి – వీటి మిశ్రమాన్ని పూస్తే వాటికి కాసే పండ్లు తియ్యగా ఉంటాయి.

239. పసుపు, "కింశుకము (మోదుగు)', పత్తి విత్తనాలు, "మాంజిష్ఠ", లోధ్ర వీటిని కలిపి మిశ్రమం తయారు చేసి, ఆ మిశ్రమాన్ని నీళ్లల్లో కలిపి ఆ నీళ్ళను చెట్టుకు పడితే, తెల్ల రంగులో వున్న ఆ చెట్టుకున్న పూలు బంగారు రంగులోకి మారిపోతాయి.

240. "మాంజిష్ఠము", "పారదము (పాదరసం)", పాలు, "కన్క్షి" (సువాసనలు వెదజల్లే ఒక రకమైన మట్టి) మిశ్రమం తయారు చేసి చెట్టు వేళ్ళకు పూస్తే, ఆ చెట్టుకున్న తెల్ల పూలు కూడా బంగారు రంగులోకి మారిపోతాయి.

241. "త్రిఫల", బార్లి (యవలు) మామిడి టెంక మరియు నీలి మందులతో ద్రావకం తయారు చేసి ఎడతెగకుండా చెట్లకు పట్టి, ఇదే మిశ్రమాన్ని చూర్ణంగా చేసి వేళ్ళ దగ్గర పాదులలో దట్టించినచో కాటుక వలె నల్లని పండ్లు కాస్తాయి.

242. బార్లీ, కింశుకము, మంజిష్ఠ, పసుపు, నువ్వులు కలిపి మిశ్రమం తయారు చేసి, ఆ మిశ్రమాన్ని నీళ్ళల్లో కలిపి ఆ నీళ్ళను చెట్టుకు పట్టి, అదే మిశ్రమాన్ని ఆ చెట్టుకు పూస్తే అది ఎర్రటి పండ్లు కాస్తుంది.

243. శాల్మలి (బూరుగు) చెట్టు బెరడు, పసుపు, నీలిమందు, త్రిఫల, కుష్ఠము (చెంగల్వ కోష్టు) మరియు సారాయిలతో మిశ్రమం తయారు చేసి, ఆ మిశ్రమాన్ని కలిపిన నీళ్ళను చెట్టుకు పట్టి, వేళ్ళకు అదే మిశ్రమాన్ని పూస్తే ఆ చెట్లకు చిలుక రంగులో వున్న పళ్ళు కాస్తాయి.



244. నీలిమందు, పసుపు, లోధ్రము (లొద్దుగు), వర (త్రిఫల), నువ్వులు, అసనము (వేగిస), కాసీసము (హయిలుతుత్తము), యష్టి – వీటిని కలిపిన మిశ్రమాన్ని చూర్ణం చేసి, ఆ చూర్ణాన్ని వేళ్ళ దగ్గర చిలుకరించి, అదే చూర్ణం కలిపిన నీళ్ళు పట్టితే ఆ చెట్లు బంగారు రంగు కల పండ్లను కాస్తుంది.

245 – 247.......

248. మనకు నచ్చిన సువాసనలతో కూడిన మట్టిని చెట్ల వేళ్ల దగ్గర నింపి, ఆ తర్వాత జలదము (ముస్తె), మురము (ఒక సుగంధ ద్రవ్యము), నటము ఇరుగుడు లేక దుండిగము, నటము, వలక, వత్రకలను కలిపిన నీళ్ళను ఆహారంగా ఇస్తే వాటి పువ్వుల వాసనయే మారిపోతుంది.

249. ఆ చెట్టుకు పూసిన పువ్వుల పరిమళంతోనే నిండిన మట్టిని ఆ చెట్టు పాదులో నింపి, ఆ తర్వాత ముస్త, ముగము, నటము అనే మొక్కల ఆకులు మరియు ద్రాక్ష సారాయి కలిపిన నీళ్ళు పడితే ఆ పూలచెట్టు పువ్వులు అమోఘమైన సువాసనలు వెదజల్లుతాయి.

250–252.....

253. త్రిఫల, నువ్వులు, బార్లి (యవల), మినుములు కలిపి చూర్ణంగా తయారు చేసి ఆ చూర్ణాన్ని నీళ్లల్లో కలిపి ఆహారంగా ఇవ్వాలి. ఆ తర్వాత దానిని పసుపుతో కాపడం పెడితే చింత చెట్టు ఒక మంచి తీగగా పెరుగుతుంది.

254–258. .....

259–260. ఏదేని తీగ చెట్టుయొక్క విత్తును మేక పాలల్లో కలిపిన మామిడి చెట్టు బెరడు, మల్లెతీగ, ధాతకి (ఆరె), మాధవీ (పువ్వుల గురివెం లేక మాది ఫలము) – వీటితో మర్దన చేసి ఒక గోతిలో నాటాలి. వివిధ జాతుల చెట్లయొక్క వేళ్ళ దగ్గర నుండి మట్టిని తవ్వి ఆ మట్టితో ఆ గొయ్యిని పూడ్చాలి. ఆ తర్వాత నువ్వులు, బార్లి గింజల చూర్ణాన్ని ఆ గొయ్యిలో చిలుకరించాలి. అట్లా విత్తనం పాతిపెట్టి, అందులో పెరుగు, పాలు కలిపిన నీళ్ళను పోస్తే మంచి లత పెరుగుతుంది. ●

**గమనిక: పైన కొన్ని సంఖ్యలలో ఖాళీగా ఉంచబడినవి. దానికి కారణం. అక్కడ వివరించిన విధానాలు ఎన్నో రకాల అడవి జంతువుల మాంసం, మరియు ఇతర శరీర భాగాలతో చేయవలసిన పనులు. ఇవి రైతులకు సాధ్యం కాదు, పైగా 'మృగ హింస' చట్టానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి వాటిని వివరించటం లేదు.**

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

## జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 13వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

### ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ** రెండవ **బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును.** అంతే కాదు **ప్రోత్సాహక బహుమతి** క్రింది **రూ. 10,000లను** వివిధ **వర్గాలలో** ఎన్నుకోబడిన **ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.**

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

**దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2023**

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

---

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040-27111959)** సంప్రదించండి.

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

### రెండు ఆక్సిళ్ల రొటోవేటర్

**పేరు: సరిప్రీత్ మాన్**

**నివాసి: ముకతసర, పంజాబ్ రాష్ట్రం**



పంజాబ్ రాష్ట్రానికి చెందిన 39 సవత్సరాల గురుప్రీత్ మాన్ 12వ తరగతి వరకు చదివాడు. రాష్ట్రస్థాయిలో కబడ్డీ ఆటగాడు. స్వతహాగా యంత్రాలు, వాటి రిపేర్లపై మక్కువ ఉండటంతో స్వంతంగా ఒక మెకానిక్ షాపు ప్రారంనించి, అందులో రొటోవేటర్లు తయారు చెయ్యటం, వ్యవసాయ యంత్రాలు రిపేరు చెయ్యటం ప్రారంభించాడు. వీరి కుటుంబానికి 10 బీగాల పొలం ఉండటంతో దీనిలోనే వ్యవసాయం చేస్తుంటాడు.

వ్యవసాయంలో పొలంలో ఒకే షాఫ్ట్ గల రొటోవేటర్లను వాడటం వలన నేలను కావలసినంత మెత్తగా తిరగతోడటానికి 2-3సార్లు రొటోవేటర్‌ని నడపాల్సి వస్తోందని గమనించాడు గురుప్రీత్ మాన్. ఈ సమస్యను అధిగమించటం కోసం రెండు షాఫ్ట్‌లు గల రొటోవేటర్ ను తయారు చెయ్యటానికి పురిగొలిపాయి. సరే ఆలోచన రావటం ఏమిటి, రాత్రనక పగలనక కష్టపడి చివరికి 2012లో ఒక రెండు ఆక్సిళ్లు కల రొటోవేటర్‌ని రూపొందించాడు.

ఈయన రూపొందించిన రొటోవేటర్ ఒక్కసారి పొలంలో నడిపితే చాలు భూమి చక్కగా తిరగతోడబడుతుంది. 40 హెచ్.పి. సామర్థ్యం గల ట్రాక్టర్‌కి దీనిని అనుసంధానం చెయ్యవచ్చు. రెండు యాక్సిల్‌లు ఒకేవైపు తిరుతాయి. 7 అడుగుల నుండి 12 అడుగుల పొడవున్న రకాలు తయారు చేస్తున్నాడు. వాటికి ఎల్, జె మరియు సి రకాల బ్లేడ్లను అవసరానుసారం అమర్చుకుని భూమిని అనుకున్నంత మెత్తగా తయారు చేసుకోవచ్చు.

ఈ ఆక్సిళ్లను వర్ధమాన రీజియన్, ఫార్మా మెషినరీ ట్రెనింగ్ & టెస్టింగ్ సెంటర్ వారు ఎన్నో రకాలుగా పరీక్షించి, ఈ క్రింది విధంగా పని చేస్తోందని నిర్ధారించారు.

- పని చేసే వెడల్పు - 203-205 మి.మీ.
- వేగం కి.మీ./గంటకు - 3.63 - 3.91 కి.మీ.
- 1 గంటకి - 0.629 - 0.734 హెక్టార్‌లు దున్నవచ్చు.
- సానిల్ద్/ఐ - 82.9 - 94.1%





❀ ఎంత లోతు దున్నగలదు – 6.0 – 6.3 అంగుళాలు

❀ ఇంధనం గంటకు – 5.90 – 6.29 లీటర్లు

ఇప్పటికి ఈయన 100 యంత్రాలను స్థానికంగా, పక్క రాష్ట్రాల రైతులకి విక్రయించాడు. కొన్నవారంతా మంచిగా పని చేస్తోందని మెచ్చుకున్నారు. ముఖ్యంగా 2.3 సార్లు ట్రాక్టర్ నడిపి చేయాల్సిన పని ఒక్కసారే చేసుకోవటం ద్వారా ఇంధనం, సమయం రెండు కలసివస్తాయని ప్రశంశిస్తున్నారు.

కొత్తరకం ఆక్సిల్ నాగలి తయారు చేసినందుకుగాను గురు ప్రీతమాన్‌కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

## సులభంగా చెట్టుమీదున్న పళ్ళకు పురుగు సోకకుండా కవర్లు తొడిగే యంత్రం:

**పేరు: షాజీ వర్గేసే**

**నివాసి: ఎర్నాకుళం, కేరళ**



కేరళ లోని ఎర్నాకుళంకు చెందిన 54 సంవత్సరాల షాజీ వర్గేసే 10వ తరగతి తర్వాత చదువు మానేసి తన తండ్రికి వ్యవసాయంలో సహాయం చెయ్యటం ప్రారంభించాడు. తన పొలంలో అతను పెండలం, అరటి, రబ్బరు పండిస్తుంటాడు. బడిలో చదువుకునే కాలంలో చదువుమీద పెద్దగా శ్రద్ధ చూపేవాడు కాదు కానీ, సైన్స్, సాంకేతిక విషయాలపై మక్కువ ఎక్కువ అవటం చేత శాస్త్ర ప్రదర్శనలలో ఉత్సాహంగా పాల్గొనేవాడు. కొంతకాలం హార్డ్‌వేర్ దుకాణం నడిపి, భారీగా నష్టాలు రావటంతో దానిని మానేశాడు. ప్రస్తుతం అతను తన కుటుంబాన్ని పోషించటానికి కోళ్ళ ఫాం నడుపుతున్నాడు.





2015లో తన తోటలోని జామ కాయలని గబ్బిలాలు, పక్షులు పండక ముందే కొరికి పాడు చేస్తుండటం గమనించాడు. వాటి నుంచి జామకాయలను రక్షించటం కోసం వాటికి సంచీ లాంటిది తొడగాలని నిశ్చయించాడు. అయితే ఈ పని కేవలం చిన్న చెట్లకే సాధ్య పడుతుందని, దీనితో పెద్ద చెట్లకు కాసే పళ్ళు, కూరగాయలకి సంచులు ఏవిధంగా తొడగాలని ఆలోచించి, ఒక చిన్న పరికరం తయారు చేశాడు. దీనితో ఎంత ఎత్తులో ఉన్న పళ్ళకైనా సంచీలు తొడిగటానికి వీలవుతుంది. తద్వారా పురుగులు, పక్షులు, ఉడతల నుంచి వాటిని రక్షించుకోవచ్చు. ఏదోరకమైన కవరు ప్లాస్టిక్‌ది కానీ, బట్టది కానీ, పేపరుది కానీ దీంతో పళ్ళని కప్పటానికి వాడవచ్చు. ముఖ్యంగా జామ, కోకో, మామిడి, ద్రాక్ష, సపోట, ప్యాషన్ ఫ్రూట్, కాకరకాయ, పొట్లకాయ లాంటి వాటికి ఇది చాలా అనువుగా ఉంటుంది. మనం ఒక కవరుని కర్రకు ఏర్పాటు చేసిన హోల్డరుకు రబ్బరు బ్యాండ్‌తో అమర్చి, ఆ కర్ర ఇంకొక చిన్న మన చేతివద్ద వున్న మీట లాగితే కవరు పండు/ కాయకి రబ్బరు బ్యాండుతో కవరును కప్పబడిపోతుంది. కర్రని ఎత్తు పెంచుకోవటానికి అదనపు వెదురు బొంగు కాని, లేదా ఏదైనా కర్రని కానీదీనికి కట్టుకోవచ్చు. పివిసి పైపుతో చేసిన ఈ కర్రకి ఒక లివరు, పిన్ను, హోల్డరు లాంటి భాగాలుంటాయి. రైతులకి ఎతో మేలు చేసే ఈ కర్ర కరీదు కేవలం రూ. 350/– మాత్రమే.

పళ్ళు కూరగాయలను పక్షులు, పురుగుల నుండి కాపాడుకునేందుకు కవర్ తొడిగే కర్రను తయారు చేసినందుకు గాను షాజీ వర్గేసీకి ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

Honey Bee Network

gian

# Submit your Ideas, Innovations, Prototypes

## హనీబీ నెట్‌వర్క్
## క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డులు
## HBN CRIIA

మీవద్ద మనుషులు, పశువులు, పర్యావరణం ఎదుర్కొనే దైనందిక సమస్యలను పరిష్కరించే సృజనాత్మక, సాంప్రదాయ పద్ధతులు లేదా ఆలోచనలు ఉన్నాయా?

ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు !

**మీ ఆలోచనలను, ఇన్నోవేషన్‌లను, నమూనాలను పంపండి**



మోటార్ సైకిల్‌తో పని చేసే పొలం దున్నే యంత్రం
**మన్సుఖ్‌భాయ్ జగాని, గుజరాత్**

మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...
Email : gian@gian.org or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686

ఎంపికైన ఆలోచనలు, నమూనాలను HBN CRIIA పురస్కారంతో సత్కరించటంతో పాటు, అవి కార్యరూపం దాల్చటానికి తగ్గ ఆర్థిక / ఇతర సహాయం కూడా చేయబడుతుంది.

చివరి తేది
31
ఆగస్టు,
2022

last date

ఎంత ఎత్తున్న విద్యార్థులైనా నీళ్ళు త్రాగటానికి వీలుగా వాలుగా ఏర్పాటు చేసిన కుళాయిలు.
**ఛాయా ఠాకూర్, గుజరాత్.**



# ఆయుర్వేద జ్ఞాన మథనం



## కిడ్నీ సమస్యల నివారణకు వంటింటి చిట్కాలు :

- 'వైద్య' ఉమా మహేశ్వర రావు

'క్రానిక్ కిడ్నీ సమస్య' అని డాక్టర్లు చెబుతుంటే ఆసుపత్రుల చుట్టూ ఎంతోమంది తిరుగుతూ అనూహ్యామైన ఖర్చులకు గురవుతూ ఉన్నారు. ఈ సమస్యలకు ముందే గ్రహించి, మన వంటింట్లో లభించే వాటితోనే ఈ సమస్యను సులభంగా అధిగమించవచ్చు అంటున్నారు 'వైద్య' ఉమా మహేశ్వర రావు గారు. ఆ వివరాలను గురించి తెలుసు కుందాం.

మానవ శరీరంలో చాలా సమస్యలకు కారణం కిడ్నీలు. సక్రమంగా పని చేసి శరీరానికి ఎటువంటి ఇబ్బంది రాకుండా చేసే ప్రధాన అవయవాల్లో కిడ్నీలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం క్రానిక్ కిడ్నీ సమస్య అంటూ వైద్యులు రోగులను భయపెడుతున్నారు. అసలు ఈ క్రానిక్ దాకా పోకుండా, కిడ్నీలు ఫెయిల్ అవకుండా ఉండేందుకు ప్రకృతిలోనే అనేక పరిష్కారాలున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం కేవలం ఆహార విషయాల్లో చిన్న చిన్న మార్పులు చేసుకోవటంతో ఈ సమస్యలను ఎవరికి వారు పరిష్కరించుకోవచ్చు. భరించలేని ధన వ్యయంతో ఆసుపత్రుల చుట్టూ తిరిగి నరకయాతన అనుభవించాల్సిన అవసరం లేదు.

ప్రపంచ వ్యాప్తంగా పది లక్షల మంది కిడ్నీ (మూత్ర పిండం)ల వ్యాధితో బాధ పడుతూ కనీసం 2 లక్షల మంది వ్యాధిగ్రస్తులు రక్తశుద్ధి చేసుకుంటున్న వారు ఉన్నరని సర్వేలు చెబుతున్నాయి.

అధిక రక్తపోటు (హై బి.పి.), మధుమేహం (షుగర్ వ్యాధి), కాళ్ళ వాపులు వచ్చేవారు కనీసం 3 నెలలకోసారి రక్తపరీక్ష, ఒంటి (యూరిన్) పరీక్ష తప్పకు చేయించుకుంటూ ఉండాలి. ఆయుర్వేదంలో కిడ్నీలు ఫెయిల్యూర్ కాకుండా నివారించుకునే మార్గాలు అనేకం ఉన్నాయి. ఈ చిన్నపాటి విషయాలపై అవగాహన లేకపోవటం వల్ల, తెలిసినా అనుసరించకపోవటం వల్ల ఎన్నో ఇబ్బందులకు, ఆర్థిక నష్టాలకు గురవుతున్నారు.

మొత్తం మన శరీరంలో ప్రాధాన్యత కలిగిన అవయవాల్లో కిడ్నీ కూడా ఒకటి. ఇది పూర్తిగా పాడైపోతే ఎక్కువ కాలం బ్రతకలేము. ఎందుకంటే దాదాపు శరీరంలోని అన్ని అవయవాలు ఈ కిడ్నీలపైనే ఆధారపడి ఉంటాయి. మూత్ర పిండాలు దెబ్బ తింటే శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బతింటాయి. రక్తాన్ని శుద్ధి చేస్తూ, శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపే ప్రక్రియ కిడ్నీల ద్వారానే జరుగుతుంది. ఈ ప్రక్రియ నిరంతరం సాగాలంటే ప్రతి మనిషి రోజుకు కనీసం మూడు లీటర్ల నీటిని సేవిస్తూ ఉండాలి. ఇందులో మనం రోజూ కాఫీలు, టీలు, సాంబారు, రసం లాంటి ద్రవ పదార్థాలు తీసుకుంటూ ఉంటాం కాబట్టి కనీసం రెండు – రెండున్నర లీటర్ల నీరు తప్పక తీసుకుంటూ ఉండాలి. ఎంత ఎక్కువ నీరు తీసుకుంటూ ఉంటే కిడ్నీలు అంత ఫ్రెష్‌గా ఉంటాయన్నమాట.

కిడ్నీలు 50 శాతం ఫెయిల్ అయ్యేదాకా ఈ విషయం మనకు తెలియదు. ఆ లక్షణాలు కూడా కొందరికి కనపడవు. అందుకే మధుమేహం, రక్తపోటు ఉన్న వ్యక్తులు, శరీరంలో వాపులు ఎక్కువగా ఉన్న వ్యక్తులు తప్పనిసరిగా మూడు లేదా నాలుగు నెలలకు ఒకసారి కిడ్నీల పరీక్ష చేయించుకుంటూ ఉంటే మంచిది. కిడ్నీలు మలిన పదార్థాలను బయటకు పంపడమే కాదు, రక్తాన్ని వడకట్టి శుద్ధి చేసేవి కూడా కాబట్టి బిపి నియంత్రణలో ఉండాలన్నా కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలి. ఎందుకంటే పొటాషియం, ఫాస్పరస్, మెగ్నీషియం, యూరిక్ యాసిడ్ లాంటివన్నీ పెరుగుతున్నాయి అని డాక్టర్ల చుట్టూ తిరుగుంటారు కొందరు. మొత్తం పాడైపోయిన తర్వాత ఏ డాక్టరు మటుకు ఏం చేయ గలుగుతాడు. అందుకే ఈ ప్రక్రియ సజావుగా సాగాలంటే నీరు ఎక్కువగా తీసుకోవటం వల్ల కిడ్నీలపై వత్తిడి ఎక్కువ కాకుండా ఆరోగ్యంగా ఉండే అవకాశాలు ఎక్కువ. నీరు ఎక్కువ తీసుకున్నా, మన శరీరానికి ఎంత నీరు అవసరమో అంతే నీటిని శరీరంలో ఉంచి, మిగతా నీటిని మూత్రం రూపంలో బయటకు పంపుతాయి ఈ కిడ్నీలు.

మధుమేహం, రక్తపోటు, ఊబకాయం ఉన్నవారు దోసకాయ ను విత్తనాలతో సహా బాగా మిక్సీ పట్టుకుని, కొద్దిగా నీటిని కలుపుకుని, వేడి చేసుకుని, చల్లారిన తర్వాత సేవిస్తూ ఉంటే కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పడుకున్నప్పటి నుండి తెల్లారే లోగా దాదాపు ఒక లీటరు మూత్ర విసర్జన జరుగుతున్నట్లయితే మన కిడ్నీలు ఆరోగ్యంగా ఉన్నట్లు లెక్క వేసుకోవచ్చు.

కిడ్నీలు ఆరోగ్యంగా ఉంచటంలో ప్రొటీన్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. కాబట్టి ఈ ప్రొటీన్లను మందుల రూపంలో కాకుండా, కూరగాయల రూపంలో తీసుకుంటూ ఉంటే కిడ్నీలపై వత్తిడి ఎక్కువ పడకుండా త్వరగా జీర్ణమై కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుతాయి. మాంసాహారాల ద్వారా లభించే ప్రొటీన్లు కిడ్నీలకు ఎక్కువ ప్రమాదం కలిగే అవకాశం ఉంది. ఎందుకంటే మాంసాహారం భుజించటం వల్ల కిడ్నీలు ఎక్కువ శ్రమ పడి దాన్ని అరిగించాల్సి ఉంటుంది. అందుకే కూరగాయలు ఎక్కువగా తీసుకోవటం వల్ల అవి తేలిగ్గా జీర్ణం అవుతాయి కాబట్టి కిడ్నీలపై వత్తిడి ఎక్కువ ఉండదు. వారానికి ఒకసారి బూడిద గుమ్మడికాయను జ్యూస్ చేసుకుని సేవిస్తే కూడా కిడ్నీలకు మంచిది.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 9440286854



- 'వైద్య' కొమెర జాజి

### ఉబ్బసం, ఆయాసం నివారణకు చిట్కా:

ఉబ్బసం ఆయాసం ఎక్కువ మందికి వర్షాకాలం లేదా చలికాలంలో ఎక్కువ అవుతుంది. తక్కువ మంది అన్ని కాలాల్లో ఈ వ్యాధితో సతమతమవుతూ ఉంటారు. ఈ వ్యాధి ఉన్నవారు బాగా పండు బారిన జిల్లేడు ఆకులు సేకరించి బాగా ఎండిన తర్వాత వాటిని కాల్చాలి. అలా కాల్చినపుడు వచ్చే పొగను బాగా పీల్చినట్లయితే ఉబ్బసం ఆయాసం వున్నవారు త్వరగా కోలుకోవచ్చు. ఈపని సాయం సంధ్య వేళల్లో చేయాలి. అంటే 5-6 గంటల మధ్యలో ఇలా చేస్తే త్వరగా ఉపశమనం పొందవచ్చు.

### ఎండా కాలంలో వచ్చే నీళ్ళ విరోచనాలు అరికట్టేందుకు ఔషధం:

ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఎండాకాలం నీళ్ళ విరోచనాలు ఎక్కువగా అవుతూ ఉంటాయి. అటువంటి వారికి ఒక కప్పు బాగా మీగడ కట్టిన పెరుగు తీసుకుని అందులో రెండు చెంచాల తేనె కలుపుకుని తాగినట్లయితే నీళ్ళ విరోచనాలు త్వరగా అరికట్ట బడతాయి.

### వడదెబ్బ నుండి ఉపశమనం పొందటానికి పరిష్కారం:

ఎండాకాలం ఎవరికైనా వడదెబ్బ సోకినట్లయితే 'సుగంధ పాల మొక్క' యొక్క వేర్లను గుప్పెడు తీసుకుని, (ఇవి గ్రామాల్లో ఎక్కడైనా లభిస్తుంది) బాగా కడిగిన తర్వాత కొద్దిగా చేతితోనే బాగా నలిపి ఒక గ్లాసు నీటిలో వేసి, పొయ్యిమీద పెట్టి వేడి చేసి, ఆ నీరు సగం గ్లాసు అయ్యేదాక మరగనిచ్చి కషాయం చెయ్యాలి. చల్లారిన తర్వాత ఆ కషాయంలో బెల్లం, పటిక బెల్లం లేదా తేనె (చక్కెర మాత్రం కలపవద్దు) కలిపి తాగినట్లయితే వడదెబ్బ నుండి విముక్తి పొందవచ్చు. ఈ కషాయం కేవలం వడదెబ్బకే కాక, శరీరంలో అధిక వేడి, మూత్రంలో మంట, రక్తంతో కూడిన మూత్రం రావటం, నరాల నొప్పులు, వేసవిలో వచ్చే చికాకు, కండరాల నొప్పులు లాంటి వాటిని కూడా నయం చేస్తుంది.

### గోరుచుట్టు నుండి నివారణ పొందేందుకు ఆయుర్వేద చిట్కా:

కొంతమందికి గోరుచుట్టు అయి ఏ పనీ చెయ్యలేక, నొప్పితో చాలా బాధ పడుతూ ఉంటారు. అటువంటి వారు రెండు వెల్లుల్లి రెబ్బలు తీసుకుని, అందులో 4 మిరియాల గింజలు వేసి మెత్తగా నూరి, నూరిన మిశ్రమాన్ని ఒక తమలపాకులో వేసి, గోరుచుట్టు అయిన వేలిపైవుంచి మెత్తటి గుడ్డతో కట్టు కట్టినట్లయితే త్వరగా గోరుచుట్టు నివారించ బడుతుంది. ఈ కట్టు ఎప్పుడూ తడిగా ఉండేలా చూసుకోవాలి. నిమ్మకాయకు వేలు దూరేంత రంధ్రం చేసి, గోరుచుట్టు అయిన వేలిని అందులో దూర్చి ఉంచినా కూడా గోరుచుట్టు నుండి ఉపశమనం పొందవచ్చు.

### తలలో పేలు నిర్మూలించటానికి చిట్కా:

తలలో పేలతో కొంతమంది బాధ పడుతూ ఉంటారు. అటువంటి వారు సీతాఫలం పండు గింజలను సేకరించి, వాటిని వలిచి పప్పు బయటికి తీసి, మెత్తగా దంచి, అందులో కొద్దిగా నీటిచుక్కలు వేసి గంధంలాగా సాదాలి. అలా తయారైన పేస్టును తలకు పట్టించుకుని పది - పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేసినట్లయితే తలలోని పేలన్నీ చనిపోయి క్రింద పడిపోతాయి. సీతాఫల గింజలు పేలకు విషంలా పని చేస్తాయి కాబట్టి తలలో ఉండలేవు.

పేల నివారణకు మరో చిట్కా కూడా ఉంది. కొద్దిగా గసగసాలు తీసుకుని, అందులో కొద్దిగా నిమ్మరసం, ఒక టమోట వేసి బాగా మెత్తగా పచ్చడిలాగా రోట్లో వేసి నూరాలి. ఆ తర్వాత ఆ పేస్టును తలకు అంటించుకుని పది-పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో స్నానం చేసినా కూడా తలలోని పేలు నివారించ బడతాయి.

ఈ రెండు పద్ధతుల్లో ఏది చేసినా లేదా రెండు పద్ధతులూ చేసినా సరే తలలో పేలు చనిపోయి, మనకు తెలీకుండానే రాలిపోతాయి.

### ప్రయాణాల్లో వాంతులు అయ్యే వారికోసం చిన్న చిట్కా:

ఎంతోమంది ప్రయాణాలు చెయ్యాలంటే భయపడుతూ ఉంటారు. దానికి కారణం ఏ వాహనంలో ప్రయాణం చేసినా సరే కొద్దిసేపు ప్రయాణించిన తర్వాత వాంతులు అవుతూ ఉంటాయి. ఇలా వాంతుల వల్ల ఆ వ్యక్తే కాదు, పక్కనున్న వారు కూడా ఎంతో ఇబ్బందికి గురవుతూ ఉంటారు. ఈ సమస్య నుండి గట్టెక్కడానికి తమలపాకు రసం ఒక పావు స్పూను, అల్లం రసం ఒక పావు స్పూను, చిటికెడు మిర్యాల పొడి, చిటికెడు యాలక్కాయల పొడి ఈ నాలుగింటిని కలిపి ఒక చిన్న ముక్కుపొడి డబ్బా లాంటి దాన్లో వేసి ఉంచుకుని దగ్గర పెట్టుకోవాలి. ప్రయాణంలో అప్పుడప్పుడూ నోట్లో ఒకటి రెండు చుక్కలు వేసుకుని, చప్పరిస్తూ ఉన్నట్లయితే గమ్యం చేరే వరకు వాంతులు కాకుండా ఉపశమనం పొందవచ్చు. ఈ మిశ్రమంలో తులసి ఆకుల రసం కూడా కలుపుకుని వేసుకోవచ్చు. ఈ మిశ్రమం పాడై పోయేదంటూ ఏమీ ఉండదు పది, పదిహేను రోజులైనా సరే అలాగే ఉంచుకోవచ్చు. ఇలా చేస్తూ వచ్చినట్లయితే రాను రాను కొంత కాలం తర్వాత వాంతి సమస్య కూడా వారికి ఉండదు.

ఈ సమస్య నివారణకు కేవలం నిమ్మకాయకు చిన్న రంధ్రం చేసి, అప్పుడప్పుడూ రసం పీల్చుతూ ఉపశమనం పొందవచ్చు. అలాగే అల్లం, ఇతర మసాలా దినుసుల వాసన చూసుకుంటూ ఉన్నా కూడా కొంత వరకు ఉపశమనం పొందవచ్చు. కానీ, పైన చెప్పిన పద్ధతి రెండు లేదా మూడుసార్లు పాటించినట్లయితే భవిష్యత్తులో కూడా ఈ వాంతుల సమస్య రాకుండా ఉండే అవకాశం ఉంది.

### గుండె దడ వున్నవారు చేయవలసిన చిట్కా:

కొందరికి ఏ చిన్న చూడకూడనిది చూసినా, మనసులో అనిపించినా గుండె దడ వచ్చి చాలా భయపడుతూ ఉంటారు. అటువంటి వారు లేత మునగాకులు ఒక అర గుప్పెడు సేకరించి, అందులో బాగా పండిన అరటి పండు, కొద్దిగా పాలు, నీళ్ళు కలిపి జ్యూస్ లాగా తయారు చేసుకుని తాగినట్లయితే గుండెదడ అనేది రాకుండా ఉంటుంది.

ఈ సమస్యకు మరో పరిష్కారం కూడా ఉంది. బాగా పండిన బొప్పాయి పండు కోసుకుని, అందులో ఒకటి రెండు చెంచాల తేనె వేసుకుని మెత్తగా కలిపి జ్యూస్ చేసుకుని తాగినా కూడా గుండె దడ నుండి నివారణ పొందవచ్చు. ●

**గమనిక: ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.**

**'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700**

**'పల్లె సృజన' బృందానికి 'చిన్నశోధయాత్ర' గురించి**

'మట్టిలో మాణిక్యాలు' కాదు.... 'మాణిక్యాలు మట్టిలోనే ఉంటాయి, ఉన్నాయి'.
చూసొద్దాం, చూపిస్తాం, నిరూపిస్తాం అనే సవాలే "శోధయాత్ర".
వెతల కథలు, ఆవిష్కర్తల పాట్లు, కర్మయోగుల స్వేదాయానం, అద్భుత విజయాలు.
అయినా ఒద్దిక, పద్ధతి, పల్లె నేర్పిన పాఠం.
కానీ స్ఫూర్తి రగిల్చే విజయ గాథలు ముందుతరం మెదళ్ళను వెలిగించాలి.
అందుకు ఒక యజ్ఞం జరగాలి... శోధన జరగాలి....
నలిగిన ఆ మనస్సులను, ఈ దేశపు పునాదిరాళ్ళ పాదాలను తాకాలంటే
'యూ ట్యూబ్, విమానాల్లో, కార్లలో' కాదు,
ఆవిష్కర్తల హృదయ తపన అందాలంటే ఆలోచనల లోతు,
గాఢత తాకాలంటే గట్స్ (ధైర్యం) కావాలి.
నిన్ను నువ్వు సంసిద్ధం చేసుకోవాలి.
నిన్ను నువ్వు తగ్గించుకోవాలి.
అందుకే... అందుకే ... నడక.
అవును నడకే... నడతను మార్చేది –
ఆహాన్ని భస్మం చేసేది.
మట్టిని ముద్దాడిన పాదం –
మహత్యం జరిగినట్టు ఆనందంగా గంతేయడం,
ఆ అవకాశం తనకూ దక్కాలని మరొకటి జతకట్టడం....
ఒక్కో అడుగూ ముందేదో మహా అద్భుతం ఉన్నదని మున్ముందుకు నడవడం.
అంతర్ముఖులను చేసే ఆత్మాలోచనపు అడుగులు
మొదటిసారి .... మొదటిసారి పాదాలు తన్మయత్వం పొంది –
మెదడుకు అవకాశం ఇవ్వడం.....
అంత్యోదయం అంటే ఇదేనేమో బహుశా....
చెట్లు, పుట్ట, ముచ్చట్లు, దృక్పథాలను మార్చే చర్చలు,
వినోదాన్ని పంచే హాస్య గుళికలు, లయబద్ధంగా కదిలే పాదాలు....
'జ్ఞానాన్వేషణకై' సాగే 'సంకల్ప నదిలా' శోధయాత్ర.
ఒక్కో యాత్రీ – ఒక్కో గ్రంథం, అనుభవాల నిధి.
వేగం, విశాలత కల్గిన యువత,
అపూర్వ కలయిక – వేల యాత్రలకు వాగ్దానం..
యువకా, లోతు తక్కువైనా ఫర్వాలేదు విశాలంగా ప్రవహించు...
లోతంటే కురచగా, కుచించుకుని ఒక్కడివే కీర్తిని గడించడం.
విశాలంగా అంటే అందరినీ కలుపుకొని పరిమళించడం, ప్రకాశించడం.
ఈ యాత్రా కథంతా మాటలకందని కెమిస్ట్రీ.
జ్ఞాపకాల దొంతరల్లో ఎప్పటికీ చెరగని అనుభూతి.
ఇదీ సింహాచల చరిత్ర.
వేటగాళ్ళు రాయకూడదు, రాయలేరు.
ఇది సింహపురి గడ్డమీద సింహాల సవ్వడి మా శోధయాత్ర.



– **ప్రొఫెసర్ లక్కుల్ల మధు,** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, నల్గొండ.

**ప్రొఫెసర్ మధుగారు,**

'చిన్న శోధ యాత్ర' లో పాల్గొన్న మీ హృదయ స్పందన కవిత్వం రూపంలో పాఠకులకు యాత్ర కనిపించేలా చేశారు. శోధయాత్ర ఇంత అద్భుతంగా ఉంటుందా, ఈసారి మేమూ పాల్గొనాల్సిందే అన్నట్లుగా ఉంది. మీలాంటి యాత్రీకుల మనోభావాలే ఇప్పటి వరకు 40 శోధయాత్రలు నిర్వహించేందుకు ఎప్పటికప్పుడు 'పల్లెసృజన'ను ఉత్తేజం చేసింది. మీ అభిమానానికి, మీరు వ్యక్తపరిచిన నిష్కల్మష భావానికి ధన్యవాదములు.

**– బ్రిగేడియర్ గణేశం**

పల్లెసృజన

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

ఇన్నోవేటర్ : **వెంకటయ్య**, మహబూబ్‌నగర్

## పసుపు కొమ్ములను పాలిష్ చేసే యంత్రం

ఇన్నోవేటర్ : **అల్లాడి ప్రభాకర్**, జగిత్యాల



పసుపు నూర్పిడి తర్వాత దాన్ని బ్రాయిలర్‌లో వేసి ఉడికించి, ఆరబెట్టిన తర్వాత దాన్ని పాలిష్ చేయటం కూడా ప్రధానమైనదే. సరియైన పాలిషింగ్ చెయ్యక పోతే మార్కెట్‌లో విలువ లభించదు. కానీ ఈ పసుపును పాలిష్ చేసేందుకు ఎన్నో యంత్రాలు వున్నా అవి ఖర్చుతో కూడుకున్నవే. ఈ సమస్య నుండి పరిష్కారం కోసం చేసిందే "హ్యాండ్ ఆపరేటెడ్ పసుపు పాలిష్ యంత్రం". దిన్న ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు చేతితో సులభంగా తిప్పుతూ పసుపు కొమ్ములను పాలిష్ చేయవచ్చు.



## వేరుశనగ విత్తనాల పొట్టు తీసే యంత్రం

ఇన్నోవేటర్ : **జ్యోతుల జస్వంత్**, గుంటూరు

వేరుశనగతో చిక్కి, బెల్లపు ఉండలు తయారు చేసేందుకు వేరుశనగ విత్తనాలను వేడి చేసిన తర్వాత వాటిపైన వున్న పొట్టును తీయాలంటే వ్యాపార పరంగా చేసే వారికి ఎంతో శ్రమతో కూడుకున్న పని. హోటల్ వారు కూడా ఎక్కువ పరిమాణంలో వేరుశనగ విత్తనాల పొట్టు తీయాల్సి వుంటుంది. ఈ సమస్య పరిష్కారానికి వేరుశనగ విత్తనాలను రెండు ముక్కలుగా చేసి, వాటిపైన వున్న పొట్టు వేరు చేసే యంత్రం. విత్తనాలు వేయించిన తర్వాత ఈ యంత్రంలో వేస్తే చేలు ముక్కలైన శుభ్రమైన వేరుశనగ పప్పు ఒక వైపు, పొట్టు మరో వైపు వస్తాయి. ఐదారు మంది మనుషులు చేయాల్సిన పని కేవలం ఒక్క మనిషి చేయవచ్చు.

## పేషెంట్లను తీసుకు వెళ్ళే పొదుపైన స్ట్రెచర్

ఇన్నోవేటర్ : **అల్లాడి ప్రభాకర్**, జగిత్యాల



ప్రమాదాలు జరిగినప్పుడు, ఆసుపత్రుల్లో రోగులను తీసుకు వెళ్ళేందుకు స్ట్రెచర్‌లు ఉంటాయి. కానీ అవన్నీ ఇనుముతో తయారు చేయబడి ఉంటాయి కాబట్టి వాటిని అవసరం లేనపుడు తీసి ఉంచుకోవడానికి చాలా స్థలం ఆక్రమిస్తుంది. ఈ సమస్య పరిష్కారంగా తయారు చేయబడిందే 'పేషెంట్ లిఫ్టర్'. దీన్ని ఉపయోగించి, పేషెంట్‌ను సులభంగా ఎక్కడికైనా మార్చవచ్చు, పైగా దీన్ని అవసరం లేనప్పుడు తీసి ఉంచుకోవడానికి ఎక్కువ స్థలం అవసరం లేదు. దుప్పటిలాగా మడత పెట్టి ఒక అరలో సర్ది పెట్టవచ్చు. కాబట్టి ఆసుపత్రులలో ఇక స్ట్రెచర్‌ల కోసం ఒక గదిని కేటాయించాల్సిన అవసరం లేదు. ఎక్కడికైనా తీసుకు వెళ్ళడం కూడా చాలా సులభం. పేషెంట్‌ను ఈ స్ట్రెచర్ మీదకు మార్చడం కూడా ఎంతో సులభం.



## ఇసుకను ఫిల్టర్ చేసే యంత్రం

ఇన్నోవేటర్ : **జలీల్**, విజయవాడ

భవన నిర్మాణం జరిగేటప్పుడు గోడను నిర్మించడానికి, పిల్లర్లను వెయ్యటానికి సాధారణ ఇసుక సరిపోతుంది. కానీ నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాత గోడలకు నిండుగా సిమెంటు (ప్లాస్టరింగ్) చెయ్యటానికి అవసరమైన సన్నటి ఇసుక అవసరం అవుతుంది. దీని కొరకు సన్నటి ఇసుక కొరకు జల్లెడ పట్టాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. ఇద్దరు లేదా ముగ్గురు కూలీలు ఇసుక మేట నుంచి ఇసుక మోసుకు వచ్చి జల్లెడపైన వేస్తే మరో వ్యక్తి జల్లి పట్టిన ఇసుకను తీసి ప్రక్కన వేసి సిమెంటులో కలపాల్సి వుంటుంది. ఈ సమస్య పరిష్కారానికి ఒక చిన్న యంత్రం తయారైంది. దీని సహాయంతో 10 మంది చేసే పనిని కేవలం ఇద్దరు వ్యక్తులే చేస్తారు. ఒక వ్యక్తి ఇసుక తెచ్చి ఈ యంత్రం జల్లెడలో వేస్తే దానంతట అదే మెత్తటి ఇసుకను వేరు చేసి, లావు ఇసుక పక్కకు వెళ్ళేలా చేస్తుంది.

**కావలసిన వారు సంప్రదించండి : బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

PALLE SRUJANA Telugu Bi-monthly March - April 2022 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే

ఇన్నోవేషన్ల వీడియోల కొరకై ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి చూడవచ్చు.















పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

PhonePe

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

లేదా

'గూగుల్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

### సభ్యత్వ వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,000/- |